ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 32.0
కనిష్ఠం 22.4
****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శనివారం 9 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589 (309.0570)	42,172	42,172
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.30 (4.02)	6,134.66	6,134.99
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.8982 (42.5720)	27,571	17,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220



రాఖీ పౌర్ణమి సందడి

- బస్సుల్లో పెరిగిన రద్దీ
- నేడు సంతోషిమాత జయంతి

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగ సందడి జిల్లాలో నెల కొన్నది. శనివారం శుభ ఘడియల్లో రాఖీలు కట్టేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న దుకాణాల్లో నచ్చిన రాఖీలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో అంతటా రాఖీ విక్రయ దుకాణాలు వెలిశాయి. అలాగే ఒకరోజు ముందే మహిళలు పుట్టింటికి వెళ్తుండటంతో బస్సులు కిక్కిరిశాయి. బస్సుల కోసం బస్టాండుల్లో ప్రయాణికులు పడిగాపులుకాశారు. కొనుగోళ్లతో స్వీట్‌హౌస్, బేకరీలు, వస్త్ర దుకాణాలు సందడిగా మారాయి. అలాగే జిల్లాలోని సంతోషిమాత ఆలయాల్లో నేడు అమ్మవారి జయంతి వేడుకలను నిర్వహించనున్నారు.





నల్లగొండలో రాఖీలు కొనుగోళ్లు చేస్తున్న మహిళలు



- మత్స్య సంపద సొమ్ము ఫ్రీజింగ్‌లో మతలబు ఏంటో?
- మత్స్యశాఖలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఓ సారు
- కోర్టు ఉత్తర్వులు సైతం బేఖాతరు

నాకేంటి!

నల్లగొండ, నల్లగొండ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖలో మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని ఓ అధికారి శైలిపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవాల్సిన ఆ అధికారి ప్రతీ పనిలో 'నాకేంటి' అనేలా వ్యవహరిస్తుండటం వివాదాస్పదం అవుతోంది. కోర్టు తీర్పు, ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం ఉల్లంఘిస్తూ, తనను ఎవరూ ఏమి చేయలేరనే వితండవాదం చేయడం ఆయన నైజం.

మత్స్య పారిశ్రామిక సంఘం పరిధిలోని నాలుగు చెరువుల్లో కొన్నేళ్ల క్రితం చేప పిల్లలను వదిలారు. అవి పెద్దవి కావడంతో మత్స్య సంపదను సంబంధితశాఖ ఆధ్వర్యంలో విక్రయించారు. దీనికి సంబంధించి రూ.17లక్షల వరకు సమకూరాయి. ఈ డబ్బును సంఘంలో పాత సభ్యులైన 71 మందికి సమానంగా పంచాల్సి ఉంది. కాని, డబ్బును పంచకుండా బ్యాంకులో జమ చేశారు. దీంతో 71 మంది పాత సభ్యులు కోర్టును ఆశ్రయించగా, ఆ డబ్బును పంచాలని కోర్టు తీర్పునిచ్చింది. అయినా మిర్యాలగూడలోని స్థానిక అధికారి దీనికి అడ్డుపడుతున్నట్టు తెలుస్తోంది. దీంతో ఆయనకు కోర్టు నుంచి, సంబంధితశాఖ నుంచి నోటీసులు అందాయి. కోర్టు తీర్పుతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ డబ్బును పంచడం లేదు.

పాత సభ్యులకు ప్రాధాన్యం ఏదీ?

మిర్యాలగూడ మత్స్య పారిశ్రామిక సంఘం పరిధిలో నాలుగు పెద్ద, చిన్న చెరువులు ఉన్నాయి. యాదగిరిపల్లి, మిర్యాలగూడ చిన్న చెరువు, చింతపల్లి, శ్రీనివాస్‌నగర్ చెరువు పరిధిలో 30 ఏళ్లుగా 240మంది సభ్యులు ఉన్నారు. అందులో చాలా మంది వివిధ కారణాలతో మృతిచెందారు. ప్రస్తుతం 30ఏళ్ల నాటి సభ్యులలో కేవలం 71మంది మాత్రమే మిగిలారు. ఈ 71మందికి మత్స్యశాఖలో పని చేస్తున్న అధికారి ఏ మాత్రం ప్రాధాన్యం

- మిగతా 8వ పేజీలో...



మరమ్మతుకు నోచని ఎల్-18 ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న రైతులు(ఫైల్)

ఎత్తిపోతల భారం మోయలేం

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో అంతర్భాగంగా ఎడమకాల్వపై ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాల నిర్వహణ రైతులకు భారంగా మారింది. నిర్వహణ భారాన్ని ప్రభుత్వం రైతులకే అప్పజెప్పడంతో కాలంతీరిన మోటార్లు, పైపులు, కాల్వకట్టలు, తూములు తరుచూ మరమ్మతులకు గురవుతుండటం, దానికితోడు విద్యుత్ అంతరాయంతో సరైన సమయంలో సాగునీరు అందక రైతులు నష్టపోతున్నారు. దశాబ్ద కాలంగా ఎత్తిపోతల పథకాల నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సగానికి పైగా ఎత్తిపోతలు పనిచేయడం లేదు. ఎత్తిపోతల కింద నిర్దేశించిన లక్ష ఎకరాల ఆయకట్టులో సగానికి కూడా నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

- నిర్వహణ నుంచితప్పుకున్న ప్రభుత్వం
- తరచూ మరమ్మతులకు గురవుతున్న మోటార్లు, కాల్వలు
- విద్యుత్ కోతలతో వెతలు
- ప్రభుత్వమే నిర్వహించాలని రైతుల వేడుకోలు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగినా, ఉమ్మడి జిల్లాలో సుమారు లక్ష ఎకరాలకు ఆయకట్టుకు సాగు నీరు అందకపోవడంతో ఎడమకాల్వపై ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. వీటి ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరందించే విధంగా గత ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. రైతుల భూములను తనఖా పెట్టి 1970-72లో 18 కోఆపరేటివ్ ఎత్తిపోతల పథకాలను, ఐడీసీ కింద మరో 24, మొత్తం 42 ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేశారు. అనంతర కాలంలో మరో 26వరకు నూతన ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేశారు. ఈ పథకాల పంప్ హౌస్‌ల నిర్వహణకు సిబ్బందిని సైతం ఎన్నెస్పీ అధికారులు నియమించి, వేతనాలు సైతం చెల్లిస్తూ వచ్చారు. కాగా, తరచూ విద్యుత్ కోతలతో మోటార్లు కాలిపోవడం, నీరు అందక పంటలు ఎండిపోతుండటంతో ఎన్నెస్పీ అధికారులు సబ్‌స్టేషన్ల నుంచి ఎత్తిపోతల పథకాలకు ప్రత్యేక విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. రోజుకు 18 గంటల చొప్పున విద్యుత్ సరఫరా అయ్యేది.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రూ.4,444కోట్ల ప్రపంచబ్యాంకు నిధులతో సాగర్ కాల్వల ఆధునికీకరణ చేపట్ట గా, ఆ నిధుల నుంచి ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు రూ.200కోట్లు కేటాయించారు. ఆ తరువాత దీన్ని రూ.100 కోట్లకు కుదించినట్లు చెబుతున్నారు. వీటి ద్వారా పంపులు, మోటార్లు, కాల్వ కట్టలపై రహదారులు, తూములు మరమ్మతులు నిర్వహించారు.

ఎన్నెస్పీ నుంచి ఐబీకి

కొంతకాలం తరువాత ఎత్తిపోతల నిర్వహణ ను ఎన్నెస్పీ నుంచి ఐడీసీకి (ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) బదిలీచేసి తిరిగి నిర్వహణ చేపట్టిన ఎన్నెస్పీ ప్రస్తుతం ఐబీకి (ఇరిగేషన్‌బ్రాంచ్) అప్పగించిందని రైతులు చెబుతున్నా రు. చెరువులపై అవగాహన కలిగిన ఐబీ శాఖకు విద్యుత్ మోటార్లతో నడిచే ఎత్తిపోతల పథకాలపై

- మిగతా 8వ పేజీలో...

స్థానిక అధికారులకు అత్యవసర అధికారాలు ఇవ్వాలి



అత్యవసర సమయాల్లో మోటార్ల మరమ్మతులకు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పునకు రూ.5లక్షల వరకు నిధులు మంజూరు చేసే అధికారం ఎస్‌ఈకి లేదా ఈఈ స్థాయి అధికారికి ఇవ్వాలి. పంటలు పొట్ట, ఈత సమయంలో మరమ్మతులకు గురైతే నిధుల కోసం కమిటీకి పంపి అనుమతులు వచ్చే వరకు తీవ్ర ఆలస్యం అవుతోంది. ఎత్తిపోతల పథకాలకు వ్యవసాయ విద్యుత్ లైన్ కాకుండా ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయాలి. పథకాలకు తక్షణ మరమ్మతులు చేపట్టి నిర్వహణకు అవుట్‌సోర్సింగ్ పద్ధతిన తాత్కాలిక సిబ్బందిని నియమించి పర్యవేక్షణ చేయాలి.

- పాదూరి శశిధర్‌రెడ్డి, ఎత్తిపోతల రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఇందిరమ్మ ఇళ్లను వేగవంతంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- దేవరకొండలో సమీక్ష



దేవరకొండలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి తెచ్చి వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. ఎల్-3 నుంచి ఎల్-1కు వచ్చే ఇళ్ల లబ్ధిదారుల జాబితా పారదర్శకంగా ఉండాలన్నారు. ఇళ్లు మంజూరై నిర్మించుకునేందుకు ఆర్థిక స్థోమతలేని వారిని గుర్తించి స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా రుణం ఇప్పించేందుకు ఏపీఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణ పురోగతిని తెలుసుకొని లబ్ధిదారులకు ప్రోత్సాహం అందించాలన్నారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ, లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా బిల్లులు చెల్లించాలన్నారు. ఎల్-3 నుంచి ఎల్-1కు పంపించే జాబితాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్హులైన వారిని చేర్చాలన్నారు. సమస్యలుంటే అధికారులు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. నియోజకవర్గంలో మొదటి విడతగా 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్టు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డివిజన్‌లోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి

(ఆంధ్రజ్యోతి, హాలియా): ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా అత్యవసర సమయంలో అప్రమత్తంగా ఉండాలని, సాగునీటిని నియంత్రించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హాలియా 17వ మైలు, 42వ మైలు రాయి దేవులపల్లి వద్ద సాగర్ ఎడమ కాల్వ ఎస్కేప్ ఛానళ్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందగానే తక్షణమే నీటిని ఎస్కేప్ ఛానెల్ ద్వారా స్ట్రీమ్‌కు పంపించాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపీనాథ్, ఆర్ఐ నవీన్, తదితరులు ఉన్నారు.

వాగులకు జలకళ



వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో పొంగిపొర్లుతున్న చిత్రపరక వాగు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లావ్యాప్తంగా సగటున 3.19సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా శాలిగౌరారంలో 13.99 సెంటీమీటర్లు, నకిరేకల్‌లో 4.25 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది.

7

ఓట్ల తొలగింపు

ప్రజాస్వామానికి గొడ్డలిపెట్టు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనలో పాల్గొన్న జూలకంటి రంగారెడ్డి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి

మిర్యాలగూడ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వ్యవస్థను పరిహసిస్తూ బీహార్‌లో ఓట్ల తొలగింపునకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటివని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయం నుంచి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వరకు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అనుకూలంగా మార్చుకుని అడ్డదారిన ఓట్ల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఆరోపించారు. ఎన్డీఏ కూటమికి ఓట్లు వేయని వర్గాలుగా భావిస్తున్న ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ వర్గాలకు చెందిన ఓట్లను జాబితా నుంచి తొలగిస్తూ బీజేపీ అవకతవకలకు, అక్రమాలకు పాల్పడుతోందని అన్నారు. బీహార్ రాష్ట్రంలో 65 లక్షల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. ప్రజల, ప్రతిపక్ష పార్టీల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా ఏకపక్షంగా ఓట్ల తొలగింపునకు పూనుకోవడం రాజ్యాంగ ద్రోహం అన్నారు. అధికారం కోసం ఎన్నికల్లో కేంద్రం అడ్డదారులు తొక్కుతోందని విమర్శించారు. ప్రజాస్వామికవాదులంతా కేంద్ర నిరంకుశ విధానాలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డబ్బికార్ మల్లేష్, నూకల జగదీశ్‌చంద్ర, సత్యనారాయణ, గాదె పద్మ, బావండ్ల పాండు, మూడావత్ రవినాయక్, రెమిడాల పరుశరాములు, తిరుపతి రాంమూర్తి, అరుణ, ఊర్మిళ, గోవర్ధన్, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాలతో ఆలయాలు కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగాయి. రుద్రహోమం, లలితహోమం నిర్వహించారు. మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. దీంతో జిల్లా అంతటా ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది.

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి

డీఈవో భిక్షపతి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

హాలియా, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. శుక్రవారం హాలియా మున్సిపాలిటీలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన తనిఖీచేశారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార పదార్థాలను వడ్డించాలని స్పెషల్ ఆఫీసర్ హైమావతికి సూచించారు. అదే విధంగా స్టోర్‌రూం, కిచెన్‌రూం, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమై విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు. విద్యార్థినులకు గుణాత్మక విద్యను బోధించి వారి ఉన్నతికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



చిట్యాల పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీచేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చిట్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డెంగీపై వైద్యులు, సిబ్బందితోపాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాఖాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం గ్రామంలో డెంగీ బారిన పడిన వ్యక్తి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేసి ల్యాబ్, ఫార్మసీ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దోమలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. జ్వరం అధిక రోజులు బాధపెడుతుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని, అంకితభావంతో పేదలకు సేవలు అందించాలని కోరారు. ఆయన వెంట క్షయ నియంత్రణ జిల్లా అధికారి కళ్యాణ్ చక్రవర్తి, డీఎంవో ప్రదీప్, వైద్యాధికారి ఈసం వెంకటేశం, సీహెచ్‌వో నర్సింగ్‌రావు, అనిల్ ఉన్నారు.

నేనున్నానని... నీకేం కాదని

అనుబంధాల ప్రతీక రాఖీ




వెండి రాఖీలు



అక్కా తమ్ముడు, అన్నాచెల్లెళ్ల ఆత్మీయ బంధానికి ప్రతీక రాఖీ పండుగ. ఒక వేళ దూరంగా ఎక్కడో ఉన్నా పోస్టుద్వారానైనా అన్నాతమ్ముళ్లకు రాఖీ చేరాల్సిందే. ఆధునిక సమాజంలోనూ రాఖీ పండుగకు ఆ ప్రత్యేకత ఉంది. కులమతాలకు అతీతంగా ఈ రాఖీ పండుగను జరుపుకుంటారు. సోదరికి నేనున్నాననే భరోసా ఈ పండుగ ద్వారా సోదరికి లభిస్తుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా రాఖీ సందడి మార్కెట్లలో నెలకొంది. రోడ్లపై వెలిసిన రాఖీ, మిఠాయిల దుకాణాల వద్ద విక్రయాలు జోరందుకున్నాయి. రెండు రోజుల నుంచే మహిళలు తమ రక్తసంబంధికుల కోసం రాఖీలను కొనుగోలు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్ / మిర్యాలగూడ టౌన్/దేవరకొండ)

జోరుగా రాఖీల విక్రయాలు



ఏడాదికి ఏడాది రాఖీల తయారీలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సరికొత్త రూపాల్లో తయారు చేస్తున్నారు. గోల్డ్, సిల్వర్ రాఖీలను ఆర్డరిచ్చి తయారు చేయిస్తున్నారు. ఈ సీజన్‌లో ఫిలిగ్రీ, రెసిన్ రాఖీలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. నూలులాంటి బంగారు, వెండి తీగెలతో అల్లే రాఖీలను ఫిలిగ్రీ అని, ఎండిన పూలు, రంగులు, ఫొటోలు, అక్షరాలతో కలిపి చేసే రాఖీలను రెసిన్ అంటారు. ఇక వన్‌గ్రామ్, కాటన్, కాగితం పూలు, ప్లాస్టిక్, దారాలతో తయారు చేసే సాధారణ రాఖీల విక్రయాలు జరుగుతున్నాయి. సిరామిక్ స్టోన్స్, సిల్వర్ కోటేడ్ ఫ్యాన్సీ రాఖీలు మహిళలను విశేషంగా ఆకట్టుకోగా, బ్యాటరీ బల్బు రాఖీలు, చోట బీమ్ రాఖీలు చిన్నారుల కోసం ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా గుజరాత్, రాజ్‌కోట్, కొల్‌కత్తాలకు చెందిన ఫ్యాన్సీ రాఖీలతో పాటు చైనా రాఖీలు అధికంగా విక్రయిస్తున్నారు. ముఖ్యంగా రూ.5 నుంచి రూ.250 వరకు రాఖీలు అందుబాటులో ఉన్నాయి. కొందరు బంగారు, వెండితో చేసిన రాఖీలు కడుతుండగా, అదే తరహా బహుమతులను అందిస్తున్నారు అన్నదమ్ములు.

వారాంతంలో రావడంతో..

రాఖీ పండుగ ఈ ఏడాది వారాంతంలో రావడంతో మరింత ప్రత్యేకంగా మారనుంది. రెండో శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడంతో ఉత్సాహంగా పండుగ జరపుకునేందుకు సిద్ధమయ్యారు. విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు వరుస సెలవులు రావడంతో రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు సొంతూళ్లకు రాగా, అన్నదమ్ములకు రాఖీలు కట్టేందుకు అక్కాచెల్లెళ్లు తీరిగ్గా వెళ్లే అవకాశమొచ్చింది. దీంతో ఆర్టీసీ ప్రాంగణాలు ప్రయాణికులతో కిటకిట లాడుతున్నాయి. ముఖ్యంగా శనివారం రాఖీ వేడుక కావడంతో శుక్రవారం నుండే ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఆర్టీసీ యంత్రాంగం అందుకు తగ్గట్టు బస్సులను నడుపుతోంది.

మంత్రి సీతక్కకు సోదరుడిలా
పటేల్ రమేష్‌రెడ్డి

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి ప్రతీ ఏడాది మంత్రి సీతక్కకు రాఖీ కడుతుంటారు. రాఖీ పండుగ వచ్చిందంటే ఖచ్చితంగా సీతక్క సోదర సమానుడిగా పటేల్ రమేష్‌రెడ్డికి రాఖీ కడుతుంది. అంతేకాకుండా దంపతులుగా పటేల్ రమేష్‌రెడ్డి, సతీమణి లావణ్య సోదరికి అందజేసే విధంగా చీరను మంత్రి సీతక్కకు అందజేస్తారు. ఎన్నో ఏళ్లుగా వీరిద్దరూ రాఖీ పండుగను వేడుకలా జరుపుకుంటారు.



పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డికి రాఖీ కడుతున్న సీతక్క (ఫైల్)

రాఖీకి ముందువరుసలో ఉంటా



మేం ముగ్గురం అన్నదమ్ములం. ఒక్కతే చెల్లెలు కావడంతో అందరికీ రాఖీ పండుగ ఎంతో ప్రత్యేకం. అందరిలో చిన్నవాడిని కావడంతో చెల్లెలు కట్టే రాఖీకి ముందువరుసలో ఉంటా. అందరం వేరుగా ఉన్నా రాఖీ మా అందరినీ ఒకేచోటకు చేర్చుతుంది. సోదరి కంటే రాఖీ ముందు ఎన్ని సంపదలు ఉన్నా వెలకట్టలేనిది. నేటి వరకు ఏఒక్కరోజు రాఖీ వేడుకలకు దూరంగా ఉండలేదు. ప్రజలందరికీ రాఖీ శుభాకాంక్షలు.

- కొప్పుల వేణారెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

30 ఏళ్లుగా రాఖీ విక్రయాలు



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీగణేష్ రాఖీ బండార్ హోల్‌సెల్ దుకాణాన్ని 30 ఏళ్లుగా గుండా వెంకన్న నడుపుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా హోల్‌సేల్, రిటైల్‌గా వివిధరకాల రాఖీలను విక్రయిస్తున్నారు. పాత తరం నుంచి మొదలుకొని నేటి ఆధునిక తరం వరకు అందరికీ నచ్చే, మెచ్చే రాఖీలను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. దుకాణంలో సుమారు 10మంది వరకు ఉపాధి కల్పిస్తూ ఆర్థికంగా వారికి చేయూతనిస్తున్నారు. రాఖీ బండార్‌లో రాఖీలతో పాటు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు, చిన్నపిల్లల ఆటవస్తువులు, విక్రయిస్తుంటారు. ఈ దుకాణాన్ని నిర్వహించడం తనకు ఆనందంగా ఉంటుందని గుండా వెంకన్న తెలిపారు.

'రాఖీ' అక్షర మాలలో విద్యార్థులు

రాఖీ పండుగ సందర్భంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తిలో విద్యార్థులు వినూత్నంగా రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. సౌమ్య విద్యామందిర్ పాఠశాల విద్యార్థులు శుక్రవారం రాఖీ అక్షర మాలలో కూర్చుని వినూత్నంగా రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

- (ఆంధ్రజ్యోతి-చిట్యాలరూరల్)



చిట్యాల మండలం చిన్నకాపర్తిలో రాఖీ అక్షరమాలలో విద్యార్థులు

యూఎస్‌లో ఉన్న అన్నకు
కొరియర్‌లో రాఖీ



నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన పసునూరి పూజిత. పసునూరి దయాకర్, వాసవి దంపతులకు కుమారుడు వెంకటేశ్, కుమార్తె పూజితలు ఉన్నారు. వీరిలో వెంకటేశ్ పదేళ్ల కిందట ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లి ఉద్యోగ రీత్యా అక్కడే స్థిరపడ్డాడు. పదేళ్లలో కొన్నిసార్లు స్వస్థలానికి వచ్చినా ఆ సమయంలో రాఖీ పండుగ ఉండకపోవడంతో ఆయనకు సోదరి పూజిత రాఖీ నేరుగా కట్టలేకపోయింది. దీంతో పదేళ్లుగా రాఖీ పండుగకు చేరుకునేలా రాఖీని అమెరికాకు కొరియర్ చేస్తోంది. అయితే అన్ని పండుగలకు కుటుంబసభ్యులు, బంధువులు ఉంటే సరిపోతుంది. కానీ రాఖీ పండుగకు మాత్రం అన్నకు నేరుగా రాఖీ కడితే తను శిరసుపై అక్షింతలు చల్లుతూ అన్న ఆశీర్వదిస్తే పొందే ఆ అనుభూతే వేరంటోంది. అయినా తన సోదరుని ఆశీస్సులుంటాయని చెబుతోంది.

- (ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

భూమి గొడవలో రైతు ఆత్మాహత్యాయత్నం

నిడమనూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ఎర్రబెల్లిలో భూవివాదాల కారణంగా శుక్రవారం ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామానికి చెందిన బోదనం సైదిరెడ్డికి గ్రామంలోని 100 సర్వే నెంబరులో 4.16 ఎకరాల భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన ముల్క శ్రీనివాస్‌రెడ్డి(మాజీ ఎంపీటీసీ భర్త)కి కూడా 21 గుంటల భూమి ఉంది. ఆయన తన తోటకు వెళ్లేందుకు దారి కోసం ఈ భూమిని కొనుగోలు చేశాడు. కానీ కొంతకాలంగా ఇద్దరి నడుమ దారికి సంబంధించి భూవివాదం నడుస్తోంది. అనేకసార్లు ఘర్షణ పడ్డారు. పోలీస్‌స్టేషన్‌కు కూడా వెళ్లారు. శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన కడీలను సైదిరెడ్డి ధ్వంసం చేయడంతో ఆయన మీద కేసు నమోదైంది. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మరోసారి భూమి వద్ద ఇద్దరికి ఘర్షణ జరగడంతో సైదిరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. 108 వాహనంలో అతడిని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం సైదిరెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. కాగా తమ పట్టా భూమిని ముల్క శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ పలుకుబడితో ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నాడని, గతంలో దౌర్జన్యం కూడా చేశాడని సైదిరెడ్డి కుటుంబసభ్యులు ఆరోపణలు చేస్తున్నారు. పోలీసులు కూడా శ్రీనివాస్‌రెడ్డికి సహకరించి సైదిరెడ్డిపై అక్రమంగా కేసులు బనాయించారని వాపోయారు. వేధింపులతో మనస్థాపానికి గురై సైదిరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడని తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సైదిరెడ్డి

భూమి కోసం విశ్రాంత ఎంపీడీవో నిరాహార దీక్ష



భూమికోసం దీక్ష చేస్తున్న విశ్రాంత ఎంపీడీవో పెరుమాళ్ల వెంకటయ్య, మద్దతు గ్రామస్థులు

అర్వపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : తన భూమిని ఆక్రమించారంటూ విశ్రాంత ఎంపీడీవో సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల గ్రామంలో నిరాహార దీక్ష చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన విశ్రాంత ఎంపీడీవో పెరుమాళ్ల వెంకటయ్య మాట్లాడుతూ 627 సర్వే నెంబర్‌లో ఎకరం భూమిని పక్కనే ఉన్న లక్ష్మారెడ్డి ఆక్రమించారని తెలిపారు. తన భార్య గ్రామ మాజీ సర్పంచ్, రెవెన్యూ అధికారులకు విన్నవించినా రోజుల తరబడి దాట వేస్తున్నారని తెలిపారు. తన భూమిని తనకు అప్పగించాలని శుక్రవారం గ్రామంలో భూమి వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన వెంట శతకోటి విద్యాసాగర్, ఎడ్ల సైదులు, పేరెల్లి లింగయ్య, బొర్ర శ్రీరాములు, బొర్ర నాగరాజు, ఉడుగు వెంకులు, శతకోటి మంజుల, కలకోట్ల ఎల్లమ్మ, తిమ్మిడి లక్ష్మిసుజాత పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

సూర్యాపేటక్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఓఇంట్లో పేకాటఆడుతున్న ఆరుగురిని శుక్రవారం రాత్రి పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ ఎస్‌ఐ శివతేజ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట కొత్తబస్టాండ్ సమీపంలోని శ్రీశ్రీనగర్‌లోని ఓఇంట్లో ఎనిమిది పేకాటఆడుతున్నారు. విశ్వసయ సమాచారం మేరకు పోలీసులు ఆ ఇంటిపై దాడి చేయగా ఇద్దరు పరారు కాగా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.45వేల నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదుచేశారు. పేకాటఆడుతూ పట్టుబడిన, పరారీలో ఉన్న వ్యక్తుల్లో సూర్యాపేటలో పేరుమోసిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, పలువురు ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం.

ఉపాధి కోసం వచ్చి ప్రాణం వదిలింది

నకిరేకల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఒక మహిళా తన కుటుంబ అవసరాల నిమిత్తం కూలి పనికి వచ్చి తోటి కూలీలను పలుకరించి అందరూ చూస్తుండగానే అనంత లోకాలకు చేరింది. హృదయ విదారక ఘటన శుక్రవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని ఇందిరాగాంధీ సెంటర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే కేతేపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన చందుపట్ల తిరుపతమ్మ(45) సుతారి కూలి పని కోసం నకిరేకల్‌కు వస్తుంటుంది. రోజువారి లాగానే శుక్రవారం వచ్చింది. ఆమె తోటి కార్మికులతో మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలింది. తోటి కార్మికులు ఆమెను పరిశీలిస్తుండగా అప్పటికే ఆమె మృతి చెందింది. గుండెపోటుతో మృతి చెందినట్లు తోటి కార్మికులు తెలిపారు. ఆమెకు భర్త, కుమార్తె ఉన్నట్లు తెలిసింది. ఆమె మరణంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రాణాలను కాపాడిన కారు ఎయిర్ బెలూన్లు

మునగాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాలలో లారీని కారు ఢీకొట్టింది. మునగాల మండలకేంద్రంలో హైదారాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ సమయంలో కారులో బెలూన్ ఓపెన్ కావటంతో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



నుజ్జయిన కారు ముందు భాగం

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు అరెస్టుచేశారు. శుక్రవారం మిర్యాలగూడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పలపాడుకు చెందిన భూక్యా హనుమానాయక్, సింగాల కాటంరాజు, పల్నాడు జిల్లా కారంపూడి మండలకేంద్రానికి చెందిన మద్దూరి చంటి అలియాస్ పోతురాజులకు గంజాయి పీల్చే అలవాటు ఉంది. వీరు ఒడిశా రాష్ట్రం బలిమెలకు చెందిన ఆనంద్‌గురు నుంచి గంజాయి కొనుగోలు చేసేవారు. తమ జల్సాలకు కావల్సిన డబ్బు దొరక్కపోవడంతో గంజాయి విక్రయించేవారు. ఆ సమయంలో మిర్యాలగూడకు చెందిన యువకులతో ఏర్పడిన పరిచయం గంజాయి సరఫరాకు బీజం వేసింది. ఈ క్రమంలో హనుమనాయక్, కాటంరాజు, చంటిలు కారు, ద్విచక్ర వాహనాలపై మిర్యాలగూడ పరిసరాల్లో గంజాయిసరఫరా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ నెల 7వ తేదీన టూటౌన్, రూరల్ పోలీసులు వేర్వేరుగా తనిఖీలు చేపట్టి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, గంజాయి విక్రేతల వివరాలు బయటపడ్డాయని డీఎస్పీ వెల్లడించారు. ఇందులో టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 10మంది నిందితులపై కేసులు నమోదుచేశారు. వీరిలో ఏపీకి చెందిన మద్దూరి చంటి, మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామానికి చెందిన కారు డ్రైవర్ షేక్ రియాజ్, మిర్యాలగూడకు చెందిన ఎండీ హర్షత్ ఆయూబ్, ఎండీ సలీం అక్తర్, మహ్మద్ జునైద్ అలీ, షేక్ అఫ్రోజ్, కేశవపురం గ్రామానికి చెందిన కుర్ర సందీప్‌లను అరెస్టు చేయగా, పల్నాడు జిల్లా వెల్దుర్తికి చెందిన భూక్యా హనుమానాయక్, సింగాల కాటంరాజు, ఆనంద్‌గురు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. గూడూరు గ్రామానికి చెందిన రియాజ్ కారులో గంజాయి రవాణాకు సహకరిస్తున్నాడని నిందితుల నుంచి 2.2కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు, పక్కన సీఐ, ఎస్ఐలు

గంజాయి అక్రమ రవాణా కేసులో

మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తొమ్మిది మందిపై గంజాయి అక్రమ రవాణా కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఆనంద్‌గురు, మద్దూరి చంటి పరారీలో ఉండగా, భూక్యా హనుమానాయక్, సింగాల కాటంరాజు, మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ ఎండీ. సోహైల్ అలియాస్ జఫ్రా అలియాస్ మోడల్, షేక్ సమీర్, మహ్మద్ సమీర్, ఇందిరమ్మ కాలనీకి చెందిన ఎండీ నసీరుద్దీన్‌బాబా, రామచంద్రగూడెం కాలనీకి చెందిన లారీ డ్రైవర్ ఖానాపురం శరత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డ ఏడుగురు నుంచి 5.2 కిలోల గంజాయి, ఆరు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు, కారును సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ రెండు కేసుల్లోనూ 14మంది నిందితులు కూడా ఏపీ, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సంచరిస్తూ గంజాయి సరఫరాల్లో కీలకపాత్ర పోషిస్తున్నట్లుగా తమ విచారణలో తేలిందని డీఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న ఒడిశాకు చెందిన ప్రధాన నిందితుడు ఆనంద్‌గురును అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. గంజాయి కేసులో చిక్కిన పలువురు గతంలో పలు కేసుల్లో జైలుకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా గంజాయి కేసును ఛేదించిన సీఐ సోమనర్సయ్య, ఎస్ఐ లక్ష్మయ్య, రాంబాబును, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

లింగనిర్ధారణ చేసిన వ్యక్తి అరెస్ట్

సూర్యాపేట క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్ల పుడుతుందని అబార్షన్ చేయించుకోగా వైద్యం వికటించి మహిళ మృతి చెందిన కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మోతె మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన బయ్య అనూష-నగేష్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉండగా మరోసారి అనూష గర్భం దాల్చింది. అయితే ఐదు నెలలో పుట్టబోయేది ఆడపిల్లనా లేక మగ పిల్లవాడా తెలుసుకోవాలని భావించారు. అందులో భాగంగా మే 18న అనూష బంధువు సాయంతో సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన ఆర్ఎంపీ జానయ్యను సంప్రదించారు. ఆయన సూచనతో నకిరేకల్‌లోని ఓ స్కానింగ్ కేంద్రానికి అనూషను తీసుకెళ్లారు. అక్కడ ఆమెను పరీక్షించిన అనంతరం పుట్టబోయేది ఆడపిల్ల అని తెలిపారు. దీంతో అబ్షాన్ చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. సూర్యాపేటలోని ఒమెగా ప్రైవేట్ ఆసుపత్రిలో అనూషకు అబార్షన్ చేయించారు. ఆ సమయంలో వైద్యం వికటించి అధిక రక్తస్రావం జరిగింది. దీంతో మెరుగైన చికిత్స కోసం అనూషను ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడ మే 21న అనూష మృతి చెందింది. ఈ విషయమై అప్పటి డీఎంహెచ్‌వో డాక్టర్ కోటా చలం ఫిర్యాదు మేరకు సూర్యాపేట ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు సందీప్, వేణు, నకిరేకల్‌లో స్కానింగ్ చేసిన బాత్క యాదగిరి, ఆర్ఎంపీ జాల జానయ్య, ఖమ్మం పట్టణానికి చెందిన నాగరాజు, ఆర్ఎంపీ గణేష్, ఆస్పత్రిలో పనిచేసే శోభ, మృతురాలు అనూష బంధువు సందీప్, భర్త నగేష్, తొట్ల గణేష్‌పై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేశారు. కాగా ఇదివరకే గణేష్, సందీప్, తొట్ల గణేష్‌లను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. శుక్రవారం విశ్వసనీయ సమాచారం మేరకు నకిరేకల్‌కు చెందిన స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు బాత్క యాదగిరి ఇంటి వద్ద ఉన్నట్లు తెలియడంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం స్కానింగ్‌కు ఉపయోగించే అల్ట్రాసౌండ్ మిషన్ ఇతర పరికరాలను స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కేసులో ఇంకా అరెస్ట్ కాకుండా పరారీలో ఉన్న వారిని కూడా త్వరలోనే పట్టుకుని రిమాండ్ చేస్తామన్నారు. సమావేశంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సిబ్బంది శ్రీరాములు తదితరులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

మూసీ వాగులో యువకుడు గల్లంతు

వేములపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన యువకుడు మూసీ వాగులో గల్లంతయ్యాడు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని ఆమనగల్లు గ్రామ శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మద్దెబోయిన వెంకన్న, పార్వతమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా కొంతకాలంగా హైదరాబాద్‌లో ప్రైవేట్ వర్క్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా పెద్ద కుమారుడైన రామకృష్ణ(24) గురువారం గ్రామంలో ఊర బోనాలు ఉండగా స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపేందుకు ఆమనగల్లు గ్రామానికి వచ్చాడు. కాగా శుక్రవారం సాయంత్రం గ్రామానికి చెందిన స్నేహితులు లింగరాజు, కల్యాణ్, నాగరాజులతో కలిసి గ్రామ శివారులోని మూసీ వద్దకు చేపల వేట కోసం వెళ్లాడు. ఈ క్రమంలో చేపలు పట్టేందుకు ప్రయత్నిస్తుండగా కాలుజారి రామకృష్ణ మూసీ వాగులో పడిపోయాడు. వెంటనే గమనించిన స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించిన నాగరాజు సైతం అందులో పడిపోవడంతో తాడు సహాయంతో అతడిని కాపాడారు. అప్పటికే రామకృష్ణ వాగు ఉధృతికి గల్లంతయ్యాడు. దీంతో సమాచారం గ్రామస్థులకు తెలియజేయగా అక్కడికి చేరుకోని అతడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



గల్లంతైన రామకృష్ణ

అనర్హులకు కల్యాణలక్ష్మి కేసులో
పలువురి కేసు నమోదు

మోత్కూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో తప్పుడు పత్రాలతో కల్యాణలక్ష్మి చెక్కు పొందిన కుటుంబంపై చర్యలకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. పదేళ్ల కిందట జరిగిన వివాహాన్ని తాజాగా జరిగినట్టుగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి, అధికారులను తప్పుదోవ పట్టించిన అమ్మాయి రాధిక, ఆమె భర్త మహేష్, తల్లి సోమలక్ష్మి, తండ్రి స్వామితో పాటు అధికారుల పంచనామా సందర్భంగా తప్పుడు సమాచారం ఇచ్చిన ముగ్గురు వ్యక్తులు, మ్యారేజీ రిజిస్ట్రేషన్ సందర్భంగా సాక్షులుగా వ్యవహరించిన ముగ్గురు వ్యక్తులపైనా తహసీల్దార్ పీ జ్యోతి మోత్కూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి, పంచనామా, రిజిస్ట్రేషన్ సందర్భంగా సహకరించిన వ్యక్తుల గురించి విచారణ జరుపుతున్నామని ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఇప్పటికే లబ్ధిదారు కుటుంబం నుంచి రూ.లక్షా 116లను తహసీల్దార్ రికవరీ చేశారు. అదేవిధంగా సమగ్ర విచారణ చేయని పంచాయతీ కార్యదర్శి శోభన్‌ను, ఆర్ఐ దాసరి శ్రీనివాస్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

గంజాయి పట్టివేత

నాగారం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నాగారం మండల కేంద్రంలో పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నట్లు తెలిసింది. సూర్యాపేట-జనగాం రహదారిపై ఎస్ఐ అయిలయ్య వాహనాలు తనిఖీ చేస్తుండగా జనగాం వెళ్లే ఆర్టీసీ బస్సులో ఇద్దరు నాగారంబంగ్లా క్రాస్‌రోడ్డు వద్ద దిగారు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో వారిని అదుపులోకి తీసుకుని సోదాలు చేసి విచారించారు. వారి వద్ద బ్యాగులో సుమారుగా ఐదు కిలోలకు పైగా గంజాయి దొరికినట్లు సమాచారం. వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు సమాచారం.

షార్ట్‌సర్క్యూట్‌తో ఆస్తినష్టం

హుజూర్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామంలో తురక నాగలక్ష్మి ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో రూ.లక్ష ఆస్థినష్టం జరిగింది. టీవీ, బీరువాలు, నిత్యావసరాలు, పుస్తకాలు, వస్త్రాలు కాలి బూడిదయ్యాయి. గురువారం రాత్రి భారీ వర్షం కురిసిన సమయంలో విద్యుత్ సరఫరా నిలిచింది. ఆ తర్వాత విద్యుత్ సరఫరా కావడంతో ఒక్కసారిగా ఇంట్లో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఇంట్లోని కుటుంబసభ్యులు బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. నాగలక్ష్మి భర్త సైదులు నాలుగేళ్ల కిందట వ్యవసాయ పనులకు వెళ్లి విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నాగలక్ష్మి కుటుంబాన్ని ఆదుకోవాలని కాం గ్రెస్ నాయకులు చలమల రాఘవయ్య, మాజీ ఎంపీటీసీ వల్లభనేని విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ పాతిమాబషీర్, కడియాల రామకృష్ణ కోరారు.

డీజే యజమానుల బైండోవర్

హుజూర్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు, బోనాలు, మిలాద్ ఉన్‌నబీ పండుగల సందర్భంగా డీజే యజమానులను బైండోవర్ చేసినట్లు తెలిపారు.

వైభవంగా సువర్ణ పుష్పార్చన,

ఊంజల్ సేవోత్సవాలు



అద్దాల మండపంలో ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామి అమ్మవార్లకు వైభవంగా పూజలు నిర్వహించారు. ఆగమశాస్త్రరీతిలో స్వామివారికి స్వర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్టింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని శ్రీ రామలింగేశ్వరస్వామి వారికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.13,21,512 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వెంకట్రావు తెలిపారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టాలి

● ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్

నల్లగొండటౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ ఖాజాఅల్తాఫ్‌హుస్సేన్ అన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సొసైటీ ఫర్ మ్యాథమెటికల్ అప్లికేషన్స్ సహకారంతో, విశ్వవిద్యాలయం గణిత విభాగ ఆధ్వర్యంలో సెప్టెంబరు 3,4 తేదీల్లో గణితశాస్త్రం, అనువర్తనాలపై నిర్వహించనున్న జాతీయ కాన్ఫరెన్స్ కరపత్రాన్ని శుక్రవారం ఆయన రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జాతీయ సెమినార్లు, సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థులకు పరిశోధనలపై అవగాహన మక్కువ పెరుగుతుందని అన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చే పరిశోధకులు, వారి పరిశోధనల గురించి తెలుస్తుందని అన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల్ రవి మాట్లాడుతూ జాతీయ సెమినార్‌కు యూనివర్సిటీ అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని తెలిపారు. గణిత విభాగ అధిపతి డాక్టర్ మద్దిలేటి పసుపుల మాట్లాడుతూ జాతీయ సెమినార్‌కు దేశంలోని వివిధ యూనివర్సిటీల నుంచి ప్రసిద్ధిగాంచిన పరిశోధకులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి, గణిత విభాగ అధ్యాపకులు డాక్టర్ డి.హైమావతి, డాక్టర్ ఏ.శ్రీనివాస్, డాక్టర్ ఎన్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అతలాకుతలం



శాలిగౌరారం మండలంలో అలుగుపోస్తున్న అడ్లూర్ చెరువు

● ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ
● పలుచోట్ల నిలిచిన రాకపోకలు
● శాలిగౌరారంలో భారీ వర్షం
● 14 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం
● నిండిన చెరువులు, కుంటలు

శాలిగౌరారం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు భారీ వర్షం కురిసింది. దశాబ్ద కాలం నుంచి ఇంతటి వర్షం ఎప్పుడూ కురవలేదని స్థానికులు, అధికారులు చెబుతున్నారు. దాదాపు 14 సెంటీమీటర్లకు పైగా వర్షం ఏకధాటిగా కురవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. కుండపోతలా కురిసిన వర్షానికి దాదాపు 2 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పల్లపు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. మండలంలోని అడ్లూర్, మాదారం చెరువులతో పాటు పలు గ్రామాల చెరువులు నిండి అలుగుపోస్తున్నాయి. శాలిగౌరారం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 19 అడుగుల నీరు నమోదైంది. భారీ వర్షానికి శాలిగౌరారం నుంచి ఊట్కూరు, మాదారం వెళ్లే రోడ్డు పైనుంచి భారీగా వరద నీరు వెళ్తుండటంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. శాలిగౌరారం, మాదారం, ఆకారం, అడ్లూర్, ఊట్కూరు గ్రామాల్లో వరద నీరు ప్రవహించటంతో వరి పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. శాలిగౌరారం బస్టాండ్ సమీపంలోని పంట పొలాల్లో ఇసుక మేట వేసింది. దీంతో అక్కడి రైతులకు నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో పత్తి చేలలో నీ రు నిలిచిపోయింది. అధికారులు పరిశీలించి పంట న ష్టం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప లు గ్రామాలకు వెళ్లే రోడ్లు భారీ వర్షం పెద్ద పెద్ద గుం తలతో పాటు కోతకు గురై రాకపోకలకు ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తుండటం తీర గ్రామాలైన ఉప్పలంచ, మనిమద్దె, గు రజాల, తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి, ఇటుకులపహాడ్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. మనిమద్దె, గురజాల, తుడిమిడి, చిత్తలూరు మూసీ నదిలో రైతులు వేసుకున్న వ్యవసాయ బోరులు పూడిపోయి విద్యుత్ మోటార్లు కొట్టుకొని పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాలకవీడు, కోదాడ అనంతగిరి: సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో గురువారం రాత్రి కురిసిన అతి భారీ వర్షానికి పలు వాగులు, చెరువులు పొంగిపొర్లాయి. కల్మెట్‌తండా గ్రామంలోని చింతవాగు పొంగి రోడ్డు పైనుంచి ప్రవహించడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. కోదాడ పట్టణంలోని రోడ్లన్నీ జలమయమై లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు భారీగా నిలిచింది. రోడ్లపై మోకాల్లోతు నీరు నిలిచాయి. వర్షంతో కొద్దిసేపు విద్యుత్ అంతరాయం నెలకొంది. అనంతగిరి మండలం వాయిలసింగారంలో చెరువుల కింద సాగు చేస్తున్న వరి పొలాల్లో ఇసుక మేట వేశాయి. దీంతో పంటలు దెబ్బతిన్నాయి. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్న పంట వర్షానికి దెబ్బతినటంతో తీవ్ర నష్టం కలిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

భారీ వర్షంతో రైతుల్లో ఆనందం

● ప్రవహిస్తున్న మోత్కూరు పరిధిలోని బిక్కేరు వాగు



మోత్కూరు బిక్కేరు వాగులో ప్రవహిస్తున్న నీరు

మోత్కూరు: జిల్లాలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం రైతుల్లో ఆనందాన్ని నింపింది. వర్షాకాలం ప్రారంభమై రెండున్నర మాసాలు గడిచినా, బలమైన కార్తెలు వెళ్లిపోతున్నా భారీ వర్షాలు కురియక పోవడంతో దిగులుగా ఉన్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. జిల్లాలో అత్యధికంగా ఆత్మకూరు(ఎం) మండలంలో 15.95 సెంటీమీటర్లు, అతి తక్కువగా బీబీనగర్ మండలంలో 1.98 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అడ్డగూడూరులో 13.23సెం.మీ., గుండాలలో 8.58 సెం.మీ., మోత్కూరులో 6.83 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది జిల్లాలో ఇదే భారీ వర్షం. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అడ్డగూడూరు మండలం గోవిందాపురం శివారులో ఉన్న నక్కల వాగు ఉధృతంగా పొంగి ప్రవహించింది. వరద ఉధృతిని గమనించి పోలీసులు వాగు దాటవద్దని వాగుకు ఇరువైపులా రోడ్డుపై బారికేడ్లతో పాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో అడ్డగూడూరు నుంచి గో విందాపురం, గట్టుసింగారం, మానాయకుంట గ్రామాలకు రాత్రంతా రాకపోకలు నిలిచిపోయాయి. మోత్కూరు బిక్కేరు వాగులో నీరు ప్రవహిస్తుంది. బృందావన్ కాల్వ ద్వారా మో త్కూరు చెరువులోకి నీరు వచ్చి చేరుతుంది. నిన్నటి వరకు వెలవెలబోయిన చెరువులు, కుం టల్లోకి కొంత నీరు వచ్చింది. పత్తి, కంది తదితర మెట్ట పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుంది. వాగులు, వంకలు పారడం, చెరువులు, కుంటల్లోకి కొంతమేర నీరు రావడంతో బావులు, బోర్లలో నీటి మట్టాలు పెరుగుతాయని రైతులు ఆశిస్తున్నారు. ఇదే విధంగా ఇంకో రెండు సార్లు వానలు కురిస్తే చెరువులు, కుంటలు నిండి పంటలు పండుతాయంటున్నారు.

● ఆత్మకూరు(ఎం) మండలంతో బిక్కేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాములు పూర్తిగా నిండి అలుగులు పోస్తున్నాయి. దీంతో చెక్‌డ్యాములకు జలకళ సంతరించుకుంది. ఆత్మకూరు, కామునిగూడెం, రహీంఖాన్‌పేటలో(రెండు), ఉప్పలపహడ్, టి.రేపాక గ్రామాల్లో (రెండు) చెక్‌డ్యాములు పూర్తిగా నిండి అలుగులు పోస్తున్నాయి. మండలంలో చెరువులు, కుంటలలోకి కొద్దిపాటి నీరు చేరింది.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

● అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



సూర్యాపేట జిల్లా అర్వపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది

వలిగొండ, నార్కట్‌పల్లి, అర్వపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో గురువారం కురిసిన భారీ వర్షానికి మండలంలోని మూసీ నదిలోకి భారీగా వరద నీరు చేరుతుంది. దీంతో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. భారీ వర్షాలు కురుస్తు న్న నేపథ్యంలో మూసీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షాలతో చెరువులు, కాల్వలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వలిగొండ మండలం సంగెం గ్రామ పరిధిలో భీమలింగం వద్ద మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. సంగెం - బొల్లెపల్లి గ్రామాల నడుమ ఉన్న కల్వర్టు పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో అధికారులు ముందస్తుగా రాకపోకలు నిలిపివేసి గస్తీ ఏర్పాటు చేశారు. దీంతో చౌటుప్పల్, పోచంపల్లి, వలిగొండ పరిసర ప్రజలు భువనగిరి వెళ్లేందుకు ఇబ్బందులుపడ్డారు. పొద్దటూరు-వర్కట్‌పల్లి గ్రామల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. కురిసిన వర్షానికి రెండు విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. మూసీ పరిహహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఎదుల్లగూడెం రైల్వే అండర్‌పాస్ కింది నుంచి దాటేందుకు సిబ్బంది ఏర్పాటు చేసి హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు-పొడిచేడు గ్రామాల మధ్య, అర్వపల్లి మండలం జాజిరెడ్డిగూడెం-వంగమర్తి గ్రామాల ఉన్న మూసీ ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో అమ్మనబోలు వద్ద ఉన్న మూసీ వాగులో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. హైదరాబాద్‌లో వర్షాలు ఇలాగే కొనసాగితే వాగులో నీరు బ్రిడ్జిని తాకుతూ ప్రవహించే అవకాశమూ లేకపోలేదు. చేపలు పట్టేవాళ్లు వాగులోకి వెళ్లవద్దని పోలీసులు సూచిస్తున్నారు. మూసీ వాగులో వేసుకున్న మోటార్ల వద్దకు వెళ్లవద్దని అర్వపల్లి తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్‌ఐ సైదులు హెచ్చరించారు.

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

● రక్షాబంధన్‌కు స్వగ్రామాలకు పయనం



కేతేపల్లి : కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాలు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం నుంచి విజయవాడ వైపు వాహనాలు బారులు తీరాయి. రక్షాబంధన్ పండుగ సందర్భంగా రెండు రోజులు వరుసగా సెలవులు కలిసి రావడంతో హైదరాబాద్ నగరవాసులు పల్లెలకు పయనమయ్యారు. నల్లగొండ, సూర్యాపేట, ఉమ్మడి ఖమ్మం జిల్లాలతో పాటు ఏపీలోని పలు జిల్లాలకు నగరవాసుల వాహనాలు బారులు తీరడంతో జాతీయ రహదారిపై రద్దీ నెలకొంది. హైవేపై వాహనాలు కిక్కిరిసిపోవడంతో సర్వీస్ రహదారులు కూడా రద్దీగానే ఉన్నాయి. నల్లగొండ వైపు వెళ్లే బస్సుల కోసం ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో సీఐలు మన్మథకుమార్, విజయ్ మోహన్ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నారు.

కేతేపల్లి, : జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల రాకపోకలు పెరిగాయి. రహదారి వెంట గ్రామాల్లో కాలినడకన, ద్విచక్రవాహనదారులు జాతీయ రహదారిని దాటడం కష్టతరంగా మారింది. మండలంలోని కొర్లపహాడ్ గ్రామ శివారులో గల టోల్‌ప్లాజాలో ఇరువైపులా గల టోల్‌బూత్‌ల్లోవాహనాలు బారులుతీరి నెమ్మదిగా ముందుకు కదిలాయి.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



మహేందర్‌ను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

నాగార్జునసాగర్,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న మహేందర్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. ఆయన' ఏ స్టడీ ఆన్ ద ప్రాబ్లంస్ 'ఫేస్డ్ బై ట్రైబల్ స్టూడెంట్స్ ఇన్ లెర్నింగ్ ఇంగ్లిష్ ఆన్ ఏ సెకండ్ లాంగ్వేజేస్ ' అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది . ఆయనను శుక్రవారం కళాశాల లో ఏర్పాటు చేసిన అభినందన సభలో తో అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాధవి లత, ఏటీసీ రఘువీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

నాగార్జునసాగర్,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఐలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్‌లో 29 సీట్లు, ఈఈఈలో 02 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 10వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 11వ తేదీన స్పాట్ అడ్మిషన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9491398142, 9052571315 నంబర్లు సంప్రదించాలని వివరించారు.

మూసీకి పెరిగిన ఇన్‌ఫ్లో

● ఐదు క్రస్టు గేట్ల ఎత్తి వరద నీటి విడుదల



మూసీ ఐదు క్రస్టుగేట్ల నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు

కేతేపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు శుక్రవారం ఎగువ నుంచి ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. నాలుగు రోజులుగా ఇన్‌ఫ్లో తగ్గుతూ, పెరుగుతూ వస్తుంది. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి తర్వాత ఇన్‌ఫ్లో భారీగా వచ్చింది. ఒక్కసారిగా 13,546 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అప్పటికే అప్రమత్తంగా ఉన్న డ్యామ్ అధికారులు అప్పటికే ఎత్తి ఉంచిన రెండు గేట్లకు తోడు మరో 3 క్రస్టుగేట్లను 5 అడుగుల మేర ఎత్తి 13,050 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేశారు. శుక్రవారం ఉదయం వరకు ఇదే రీతిన నీటిని విడుదల చేసిన అధికారులు శుక్రవారం మధ్యాహ్నానికి ఇన్‌ఫ్లో కొంత తగ్గుముఖం పట్టడంతో ఒకగేటునుమూసి వేసి 2, 3, 7, 10నెంబరు క్రస్టుగేట్లను 2అడుగుల మేర ఎత్తి 5,528 క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగించారు. అయితే శుక్రవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో ఇన్‌ఫ్లో మరోమారు పెరగడంతో మధ్యాహ్నం మూసేసిన 10వ నంబరు క్రస్టుగేటను సైతం ఎత్తి మొత్తం 5గేట్లతో 6వేల క్యూసెక్కుల పైచిలుకు వరద నీటిని దిగువకు వదులుతున్నారు. ఇదిలా ఉంటే 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.30అడుగులు (4.02టీఎంసీలు)గా ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 334.52క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

589.10 అడుగులకు చేరుకున్న సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్ : ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 589.10 అడుగులుగా (309.3558టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 5,598 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7,353 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,948 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 43,999 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువ నుంచి 43,999 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.

పరిశ్రమల్లో సమస్యల పరిష్కారానికి కృషి



అవగాహన ఒప్పందం చేసుకుంటున్న విద్యాసంస్థల ప్రతినిధులు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామని ప్రొఫెసర్ నాగభూషణ్ తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, హైదరాబాద్ విజ్ఞాన్స్ వర్సిటీ, ఐఐటీ హైదరాబాద్‌ల మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరిందని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి నాగభూషణ్ తెలిపారు. ఐఐటీ - హైదరాబాద్‌లోని స్పాన్సర్డ్ కన్సల్టెన్సీ అండ్ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ జి నరహరిశాస్త్రితో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ సుబ్బారావు అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వల్ల ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవచ్చునని అన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, ఇండస్ట్రీ - అకడమియా ఇంటరాక్షన్స్‌ను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ - హైదరాబాద్ బయోటెక్నాలజీ అధ్యాపక బృందం, విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం రీసైక్లింగ్ ముఠా అరెస్టు

● లబ్ధిదారుల నుంచి సేకరించి ఏపీలోని రైస్‌మిల్లుకు తరలింపు
● వాడపల్లి చెక్‌పోస్టు వద్ద 30టన్నుల బియ్యం లారీ పట్టివేత



మిర్యాలగూడలో రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు, చిత్రంలో పట్టుబడ్డ నిందితులు

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను నల్లగొండ జిల్లా వాడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా అర్బన్ ప్రాంతానికి చెందిన కొమ్మలపాటి శ్రీనివాస్ అదేజిల్లాలోని వట్టిచెరుకూరు మండలం చామలముడి గ్రామశి వారులోని పద్మజ రైస్ ట్రేడర్స్‌లో రెండేళ్లుగా గుమస్తాగా పని చేస్తున్నాడు. తన వృత్తితోపాటు గూడ్స్ ఆటోలు నడిపిస్తుండేవాడు. ఈ క్రమంలో రేషన్ బియ్యం సేకరణ, రీ సైక్లింగ్‌పై అవగాహన పెంచుకున్న శ్రీనివాస్ పద్మజ రైస్ ట్రేడర్స్ మిల్ యజమాని వెంకటసుబ్బారావుతో చేతులు కలిపాడు. గుంటూరు జిల్లాలోని వట్టిచెరుకూరు, నల్లపాడు, లాలాపేట, కాకాని, పత్తిపాడు గ్రామాల్లో గూడ్స్ ఆటోలో తిరుగుతూ లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం సేకరించడం ప్రారంభించాడు. అలాగే ఏపీ సరిహద్దులోని తెలంగాణ ప్రాంతాల్లోనూ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయడం మొదలుపెట్టాడు. రేషన్ లబ్ధిదారుల నుంచి కిలో రూ.11లకు బియ్యాన్ని సేకరించి ఆటోలో వాడపల్లి చెక్‌పోస్టు దాటించి రైస్‌మిల్లుకు చేరవేసి అక్కడ పాలిష్‌పట్టి ఆర్డర్లపై ఒడిశా, గుజరాత్, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలతోపాటు కాకినాడ, ఆర్మూర్ ప్రాంతాలకు సరఫరా చేసి కిలో రూ. 33కు విక్రయిస్తున్నట్లు పోలీస్ విచారణలో నిందితుడు శ్రీనివాస్ అంగీకరించాడు. ఈ నెల 5వ తేదీన గుజరాత్‌కు చెందిన మన్సూక్‌బాయ్ నుంచి బియ్యం ఆర్డర్ వచ్చింది. దీంతో నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి, దామరచర్ల, మిర్యాలగూడ మండలాల పరిధిలోని లబ్ధిదారుల నుంచి గతంలో సేకరించిన రహస్య ప్రదేశంలో డంప్ చేశాడు. అనంతరం సుమారు 30 టన్నుల బియ్యాన్ని లారీలో తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు వాడపల్లి చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యానికి పాలిష్ పట్టి పద్మజ రైస్ ట్రేడర్స్, కాకినాడకు చెందిన శ్రీ వెంకటేశ్వర రైస్ ట్రేడర్స్‌పై వే బిల్లులు తయారుచేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నట్లు గుర్తించామన్నారు. రేషన్ బియ్యం వ్యాపారం సజావుగా సాగించేందుకు పద్మజ రైస్ ట్రేడర్స్ యజమాని వెంకట సుబ్బారావు, శ్రీవెంకటేశ్వర రైస్ ట్రేడర్స్ బ్రోకర్ రమేష్ వ్యాపారి శ్రీనివాస్‌కు సహకరిస్తున్నారు. ఏపీ, తెలంగాణ ప్రాంతాల్లోని చెక్ పోస్టులను దాటించేందుకు పిడుగురాళ్లకు చెందిన మహేశ్‌రెడ్డి సహకరిస్తూ నెలకు రూ.3లక్షల వరకు కమీషన్ రూపంలో తీసుకుంటున్నాడు. అదేవిధంగా బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు రమేష్, వాసు అనే మరో ఇద్దరు బ్రోకర్లు వ్యాపారికి సహకరిస్తూ నూటికి 10నుంచి 20శాతం కమీషన్ పొందుతున్నట్లు తమ విచారణలో నిందితులు నేరం అంగీకరించారని డీఎస్పీ తెలిపారు. రేషన్ బియ్యం దందాల్లో ప్రమేయం ఉన్న ప్రధాన నిందితుడు కొమ్మలపాటి శ్రీనివాస్‌తోపాటు వెంకటసుబ్బారావు, మహేష్‌రెడ్డి, బ్రోకర్ సకిల శ్రీనివాస్, గుజరాత్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ మనుబాయి మక్వన అరెస్టుచేసి రిమాండ్‌కు పంపగా, మరో బియ్యం బ్రోకర్ రమేష్‌తో పాటు, రేషన్‌బియ్యం దందాలో ప్రమేయం కలిగిన నాగసాయి, గుజరాత్ రాష్ట్రానికి చెందిన బియ్యం వ్యాపారి మన్సూక్‌బాయ్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన వాడపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, త్రిపురారం ఎస్‌ఐ నరేష్‌ను డీఎస్పీ అభినందించారు.

ధర్మస్థలి ఘటనలో నిందితులను శిక్షించాలి



ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మస్థలి ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దేవరం మల్లీశ్వరి కోరారు. శుక్రవారం పట్టణంలోని బైపాస్ రోడ్డులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం దోషులను కఠినంగా శిక్షించి సుప్రీంకోర్టు జడ్జితో ఉన్నత స్థాయిలో విచారణ చేయించాలన్నారు.. మానవ మృగాలతో మహిళలకు భద్రత కరువైందదన్నారు. కార్యక్రమంలో సామ్రాజ్యం, లింగమ్మ, లత, నాగలక్ష్మి, సూరమ్మ, అరుణ పాల్గొన్నారు.

వర్షాలతో పత్తి, పెసర, వరికి మేలు

భువనగిరిరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పత్తి, కంది, పెసర, మొక్కజొన్న, వరి పంటలకు మేలు చేకూరుతుందని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి. అనిల్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వివిధ దశల్లో పంటల్లో ఎదుగుదలకు దోహదపడుతుందని అన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి : ఎస్‌ఐ

తిప్పర్తి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ శంకర్ అన్నారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలోని గోరంట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ రద్దీగా ఉండే ప్రదేశాల్లో వినూత్న వేషధారణతో అవగాహన యువతకు అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సంత వద్ద ఎస్‌ఐతో కలిసి స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, తిప్పర్తి పోలీస్ స్టేషన్‌సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం దిశగా అడుగులు వేయాలి

కేతేపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కళాశాల స్థాయి నుంచే లక్ష్యం దిశగా అడుగులువేయాలని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. మండలంలోని రాయపురం సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ వేడుకకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, కళాశాల ప్రిన్సిపాల్ ప్రిన్సి, నాయకులు బొజ్జ సుందర్. టి.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నాకేంటి!

(5వ పేజీ తరువాయి)

ఇవ్వడం లేదు. చనిపోయిన వారి స్థానంలో వారి వారసులకు సభ్యత్వాలు ఇవ్వాలి. కాగా, అందుకు విరుద్ధంగా కొత్తగా అడహక్ కమిటీని నియమించి వారసులకు సభ్యత్వాలు ఇవ్వకపోగా, కొత్తగా మరో 100మందిని సభ్యులుగా సృష్టించారు. ఒక్కో సభ్యత్వానికి వారి నుంచి రూ.10వేలకు పైగా వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడహక్ కమిటీని ఎన్నికల వరకు కొనసాగించే వీలుంటుంది. అయితే ఈ కమిటీలో అర్హులైన వారికి సభ్యత్వాలు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాల్సి ఉండగా, అనర్హులకు, అనుకూలమైన వారికి సభ్యత్వాలు ఇచ్చి ఎన్నికల్లో మోసాలకు పాల్పడేందుకు యత్నిస్తున్నారని చర్చ సాగుతోంది. మత్స్యశాఖలో సభ్యత్వాలు ఇచ్చే ముందు స్కిల్ టెస్ట్ నిర్వహించాలి. చెరువులో వలలు విసరడంతో పాటు వివిధ అంశాల్లో అధికారులు పరీక్ష నిర్వహించి సభ్యత్వాలు ఇవ్వాలి. అలాంటివి ఏమీ లేకుండానే 100 మంది వరకు సభ్యత్వాలు ఇచ్చారు. వారసులను పూర్తిగా పక్కన పెట్టడంతో పాటు జనరల్ బాడీ సమావేశాలు ఏర్పాటు చేయలేదు. మూడేళ్లుగా జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించకుండా అడహక్ కమిటీ పెత్తనం చేస్తోంది. మొత్తం ముగ్గురు అధికారుల కనుసన్నల్లోనే ఈ కమిటీ పనిచేస్తూ తోచిన విధంగా వ్యవహరిస్తోందని, బెస్తలకు, ముదిరాజ్‌లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను దూరం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందని మత్స్యకార్మికులు పలువురు ఆరోపిస్తున్నారు. అడహక్ కమిటీ నిబంధనల మేరకు పనిచేయకుండా పూర్తిస్థాయి ఎన్నికైనా కమిటీలా వ్యవహరిస్తూ మిర్యాలగూడ మత్స్యపారిశ్రామిక సంఘాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డబ్బు పంపిణీ ఎఫ్‌డీఏ పరిధిలో ఉంటుంది

మిర్యాలగూడ మత్స్య పారిశ్రామిక సంఘం సంబంధించి గతంలో కార్మికులకు చెల్లించాల్సిన డబ్బును బ్యాంకులో జమ చేశారు. అది మా పరిధిలో లేదు. డబ్బు పంపకాల వ్యవహారం పూర్తిగా ఎఫ్‌డీఏ పరిధిలోనే ఉంటుంది. ఉన్నతాధికారుల సూచన మేరకే డబ్బును పంచాలని ఆదేశాలు జారీ చేశాం.

\- చరిత, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఆలయాల్లో ఘనంగా వరలక్ష్మీవ్రతాలు

● సామూహికంగా కుంకుమార్చనలు

నల్లగొండ కల్చరల్, నార్కట్‌పల్లి, చిట్యాల, నకిరేకల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండవ శుక్రవారం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో వరలక్ష్మీ వ్రత మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు, స్వాములు అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి శాస్త్రోక్తంగా అభిషేకాలు, కుంకుమార్చనల పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి భక్తితో సామూహికంగా కుంకుమార్చనలు చేశారు. పట్టణంలోని షేర్‌బంగ్లాలోని సంతోషిమాత ఆలయం, వీటీకాలనీలోని శ్రీదేవి భూదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, తులసీనగర్‌లోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం, రామగిరి శ్రీసీతారామచంద్రస్వామి, బీట్ మార్కెట్ రామకోటి స్తూపదేవాలయం, పానగల్ ఛాయ, పచ్చల సోమేశ్వరస్వామి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాల మహోత్సవాలు, కుంకుమార్చనల పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. వీటీ కాలనీ దేవాలయంలో భక్తులు దోనాల నాగార్జునరెడ్డి, సుభాషిణి దంపతులు భూదేవి అమ్మవారికి లక్ష రూపాయల విలువైన కిలో వెండి అభయహస్తం, దాడమిహస్తం, భుజకిరీటాలను ఆలయ కమిటీకి విరాళంగా అందజేశారు. అదే విధంగా రామవేంద్రకాలనీలోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. దీంతో ఆలయాలన్నీ మహిళా భక్తుల తో సందడిగా మారాయి.

● నార్కట్‌పల్లి మండలంలోని పలు దేవాలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం, గోపలాయపల్లి వేణుగోపాలస్వామి దేవస్థానం, నార్కట్‌పల్లి లోని పార్వతీ రామలింగేశ్వరాలయం, వారిజాల వేణుగోపాలస్వామి ఆలయం, అనంత స్వర్ణగిరిలోని మహాలక్ష్మి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాల ను భక్తి ప్రపత్తులతో ఆచరించారు. అర్చకులు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, నిడిగొండ భగవాన్‌శర్మ, కారంపూడి కృష్ణమాచార్యులచే ఆయా ఆలయాల్లో జరిగిన ఈ వేడుకల్లో దోసపాటి ప్రసాద్, ఉండ్ర భాగ్యమ్మలింగారెడ్డి, పుల్లెంల శ్రీనివాస్, సామ కొండల్‌రెడ్డి, శేఖర్, విష్ణు, వేణు, పాల్గొన్నారు.





నల్లగొండ సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు, నకిరేకల్‌లో అలంకరించిన అమ్మవారు

చిట్యాల పట్టణంలోని కనకదుర్గ ఆలయంలో వరలక్ష్మి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులు, మేనేజర్ అంబటి నాగిరెడ్డి, డైరెక్టర్లు గంజి వెంకటేశం, బుద్ధ విమల, వరకాంతం నర్సిరెడ్డి, రుద్రారపు లింగయ్య, జిట్ట సాయిలు, వన మా నిఖిల్‌కుమార్ పాల్గొన్నారు.

నకిరేకల్ పట్టణంలోని ఎమ్మెల్యే వేముల వీరేశం స్వగృహంలో వరలక్ష్మి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎల్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారు శ్రీవరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఉదయం లక్ష్మీ అష్టోత్తర సహస్రనామార్చన పూజలు నిర్వహించి అమ్మవారికి మంగళ హారతులిచ్చారు. వివిధ ప్రాంతా ల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. చీరసారె, ఒడి బియ్యం, బోన నైవేద్యాలను భక్తిశ్రద్ధలతో అందజేసి మొక్కు లు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకటరెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

శాలిగౌరారం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య అన్నారు. మండలంలోని అడ్లూరు గ్రామంలో నిర్వహించిన సమావేశంలో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అధికారులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చింత నరేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బోడ అరుణ్‌కుమార్, అధికార ప్రతినిధి బోడ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోడ దానయ్య, నాయకులు నిమ్మల కృష్ణ, నల్లగొండ శ్రీనివాస్, బండారు హనుమంత్, నర్సయ్య, భాస్కర్, లింగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

మోదీ పాలనలో శరవేగంగా అభివృద్ధి

కనగల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మోదీ పాలనలో గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దాసరి వెంకన్న అన్నారు. బీజేపీ మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా మండలంలోని తుర్కపల్లి, అజ్జలాపురం, ఎంగొరారం తదితర గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు ఆదిమళ్ల దేవేందర్, చింతల శంకర్, ఆదిమళ్ల రాకేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి సమస్యకు పరిష్కారం

నార్కట్‌పల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అవురవాణి గ్రామస్థులు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి సమస్యపై ఆంధ్రజ్యోతిలో 'ఒక్క బోరే దిక్కు'.. అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈలు శుక్రవారం అవురవాణి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో నీటి ఎద్దడి సమస్యకు కారణాలు తెలుసుకున్నారు. అద్దె బోరు యజమానితో మాట్లాడి నీటిని సరఫరా చేసేలా ఒప్పించారు. ఈ నెలాఖరులోగా బకాయి బిల్లును ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు గ్రామానికి మిషన్ భగీరథ ద్వారా ప్రస్తుతానికి 1.20లక్షల లీటర్ల నీరు అందుతుండగా దానిని 1.90 లక్షల లీటర్ల పెంచనున్నట్లు తెలిపారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



అద్దె బోరు యజమానితో మాట్లాడుతున్న అధికారులు

రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న మోదీ

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న పబ్బు వీరస్వామి

నల్లగొండరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అసెంబ్లీలో 42 శాతం అమ లు చేయాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపితే ప్రధాని నరేంద్ర మోదీ అడ్డుపడుతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి అన్నారు. పట్టణంలోని మగ్దూం భవనంలో శుక్రవారం నిర్వహించిన నల్లగొండ పట్టణ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మా ట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీ ఆమోదించి, కేం ద్రానికి పంపితే ప్రధాని న రేంద్ర మోదీ అడ్డు పడుతున్నారని తెలిపారు. తమిళనాడుకు ఇచ్చిన విధంగానే 9వ షెడ్యూల్లో చేర్చి చిత్తశుద్ధితో కేంద్ర వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం వెంటనే రిజర్వేషన్లను అమలు చేయాలని లేనిచో బీసీలతో ఐక్యపోరాటాలు చేస్తూ కేంద్రంపై ఒత్తిడి చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పా ర్టీ పట్టణ సహాయ కార్యదర్శి వి.లెనిన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నా యకులు కర్ర సైదిరెడ్డి, ఎండీ యూసుఫ్, పాండరయ్య, వీరయ్య, సుజాత, విజయ, కౌసల్య, చింత ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

కట్టంగూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో పి.జ్ఞానప్రకాశ్‌రావు అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఈదులూరు గ్రామంలో ఎక్సైజ్ అధికారులు, ఉపాధిహామీ సిబ్బందితో కలిసి ఆయన ఈత మొక్కలను నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, భావి తరాలకు మనం ఇచ్చే సంపద చెట్లు నాటడమేనని అన్నారు. మానవాళి మనుగడకు ప్రాణవాయువునిచ్చే మొక్కలను ప్రతి ఒక్కరూ విరివిరివిగా పెంచాలన్నారు. అనంతరం గౌడ కులస్థులకు 2వేల ఈత మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మల్లయ్య, ఏపీవో కడెం రాంమోహన్, ఈసీపీ ఎస్.వెంకన్న, ఎఫ్‌ఏ దాసరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' నిరుపేదలకు వరం

మర్రిగూడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒక వరం లాంటిదని వాటిని సద్వినియోగం చేసుకోవాలంటూ బీమనపల్లి మాజీ ఎంపీటీసీ సిలివేరు విష్ణు అన్నారు. మండలంలోని దామెర బీమనపల్లి గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నిర్మాణాల పనులకు ఆయన ముగ్గు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నడిమిట్టి శ్రీను, యాదయ్య, రాములు, వెంకట, మహేష్, ఎల్లయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ఇంటింటికి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మర్రిగూడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శాలిని అన్నారు. మండల కేంద్రంలోని మధురానగర్ కాలనీలో శుక్రవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ఫీవర్ సర్వేను నిర్వహిస్తూ చుట్టుపక్కల ఉన్న పరిసరాల ప్రాంతాలను పరిశీలించారు. ఇంటి చుట్టూ నీటి నిల్వ లేకుండా శుభ్రం చేసుకుంటే ప్రజలకు విషజ్వరాలు సోకవని అన్నారు. ఇంట్లో ఎవరికైనా జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయవద్దని, వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. ఆమె వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి

మర్రిగూడ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు తిరుమలేష్ అన్నారు. మండలంలోని బట్లపల్లి, వట్టిపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశాల్లో దివ్యాంగుల చేయూత పెన్షన్‌దారుల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిట్యాలలో 11వ తేదీన నిర్వహించే దివ్యాంగుల మహాసభకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు మేతరి రాములు, యాదయ్య, శ్రీను, రాజు, వెంకటేష్, రాములమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

ఎత్తిపోతల భారం మోయలేం

(5వపేజీ తరువాయి)

అవగాహన లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయని రైతులు వాపోతున్నారు. ఐడీసీ కింద సాగర్ నియోజకవర్గంలో 19, మిర్యాలగూడ పరిధిలో 18, ఎన్నెస్పీ కింద మిర్యాలగూడలో 15, సాగర్ నియోజకవర్గంలో 16, మొత్తం 68 ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. ఐడీసీ ఎత్తిపోతల పథకాల ద్వారా 24,150 ఎకరాలు, ఎన్నెస్పీ ఎత్తిపోతల పథకాల ద్వారా 47వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. ఇప్పటికే ఐడీసీ పరిధిలో 15వేల ఎకరాలకు సాగునీరందించే 18ఎత్తిపోతల ప్రాజెక్టులను ఎత్తివేశారు. ఎత్తిపోతల పథకాలను రైతులే నిర్వహించుకోవాల్సి రావడంతో నిర్వహణ భారం మోయలేని పరిస్థితి ఏర్పడింది. రైతులు బోరు, బావుల లాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడంతో 18 ఎత్తిపోతల పథకాలను ఎత్తివేశారు.

నూతన ఎత్తిపోతల పథకాలకు చర్యలు

మిర్యాలగూడ డివిజన్‌లో కొత్తగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో నెల్లికల్, దున్నపోతుల గండి, కేశవపురం, బొత్తలపాలెం, వజీరాబాద్, వీర్లపాలెం ఎత్తిపోతలను నిర్మించనుంది. నెల్లికల్ ఎత్తిపోతల ద్వారా రాజవరం మేజర్ కింది చివరి భూములకు 8,500 ఎకరాలకు, నూతనంగా 16,100 ఎకరాలకు మొత్తంగా 24,600 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

మిర్యాలగూడ నియోజకవర్గంలో ఐదు ఎత్తిపోతల పథకాల ద్వారా 12,500 ఎకరాల చివరి భూములకు, 19వేల నూతన ఆయకట్టుకు నీరు అందించేలా నిర్మాణం చేపట్టా రు. రూ.24కోట్ల వ్యయంతో పొగిళ్ల, రూ.202కోట్లతో కంబాలపల్లి, రూ.184కోట్లతో వైజాగ్ కాలనీ సమీపంలో అంబాభవాని, రూ.82కోట్లతో పెద్దగట్టు, రూ.90కోట్లతో అంగడిపేట సమీపంలో ఏకేబీఆర్ ఎ త్తిపోతల పథకాలను ప్రభుత్వం నిర్మిస్తోంది. వీటి ద్వారా ఆయకట్టు చివరి భూములకు నీరందించడమేగాక నూతనంగా వేలాది ఎకరాల భూములు సాగులోకి రానున్నాయి. అయితే కొత్త ఎత్తిపోతలను ఏర్పాటుచేస్తున్నా, వీటి నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే ఉన్న ఎత్తిపోతల పథకాల నిర్వహణ భారం తమపై వేయడంతో అవి అస్తవ్యస్తంగా మారి నిరుపయోగమవుతున్నాయని, ప్రస్తుతం కొత్తగా ఆయకట్టును స్థిరీకరించిన నేపథ్యంలో అన్ని ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మరమ్మతులను పూర్తిస్థాయిలో చేపట్టాలి



రైతులకు ఎత్తిపోతల పథకాల నిర్వహణ భారంగా ఉంది. చాలాకాలం నుంచి మోటార్లు, కాల్వకట్టలు, తూములకు మరమ్మతు చేయనందున పంటలకు సాగు నీరు సక్రమంగా అందడం లేదు. విద్యుత్ లైన్‌ను మార్చి రోజు రాత్రి వేళల్లో సుమారు 6 గంటలు విద్యుత్‌లో కోత విధిస్తున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ చూపి మరమ్మతులు చేపట్టి నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించాలి.

\- కొప్పు వెంకన్న లిఫ్ట్ రైతు

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం



ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఆర్-6కు రూ. 3.70లక్షలు, ఎల్-16కు రూ.12లక్షలు, ఎల్-17 కు రూ.4.5లక్షలు, ఎల్-18కు రూ.13లక్షలు, ఎల్-20కి రూ.10లక్షలు, ఎల్-21కి రూ.12లక్షలతో మోటార్లు, వైర్లు, స్టార్టర్లు, బేరింగ్‌లు తదితర మరమ్మతు పనులకు ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు నివేదించాం.

\- జనార్దన్, ఐబీ డీఈ

ఇసుక రీచ్‌కు హద్దులు ఏర్పాటు చేయాలి

కనగల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.లింగోటం గ్రామ వాగులోని ఇసుక రీచ్‌కు హద్దులను ఏర్పాటు చేయాలని ఇసుక ట్రాక్టర్ యజమానుల కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం తహసీల్దార్ పద్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొంతమంది ఎకరాల కొద్దీ వాగు భూమిని కబ్జాకు చేసి అచ్చు కట్టారని తెలిపారు. ఇసుక కోసం వాగులోకి దిగితే సదరు కబ్జాదారులు దాడుల చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ వాగు కబ్జా చేసిన వారికి త్వరలోనే నోటీసులిచ్చి ఇసుక రీచ్‌కు హద్దులు ఏర్పాటు ఏర్పాటు చేస్తానని తెలిపారు. అంతకుముందు అదనపు కలెక్టర్, ఆర్డీవోకు, ఎస్ఐకి, మైనింగ్ అధికారులకు కూడా సమస్యను విన్నవించినట్లు తెలిపారు.

అట్రాసిటీ కేసులో డీఎస్పీ విచారణ

శాలిగౌరారం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీదేవి వైన్స్ వర్కర్లు బట్ట చిన సైదులు, సాయికుమార్‌లపై ఇటీవల దాడి జరిగింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కావడంతో శుక్రవారం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి శాలిగౌరారంలోని వైన్స్ వద్ద విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా బాధితులను, సాక్షులను విచారించారు. వైన్స్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు.

అనంతరం డీఎస్పీ శివరాంరెడ్డి మాట్లాడుతూ కేసు విషయాలను విచారణ చేసి పరిశీలిస్తామన్నారు. దాడి చేసి కులం పేరుతో దూషించిన వారిని ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ జిల్లపల్లి శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి

నార్కట్‌పల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పట్టణ రోడ్డు విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించాలని శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఎంపీవో సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తికాకపోవటంతో ప్రమాదాలు జరిగి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేలా ఉన్నతాధికారులకు తెలియజేయాలని, లేనిచో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు పాల్వాయి భాస్కర్‌రావు, బిల్లకంటి శ్రీకాంత్, నోముల నాగరాజు, మల్లెబోయిన రామలింగం, పాలకూరి రమేశ్‌లు ఉన్నారు.

ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్య విరుద్ధం

● సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి



నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్, కేతేపల్లి, చిట్యాల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రంలో అక్రమంగా అధికారంలోకి రావాలని దుర్బుద్ధితో లక్షల ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్య విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. ఓట్లు తొలగించడాన్ని నిరసిస్తూ శుక్రవారం జిల్లాకేంద్రంలో పాటు, కేతేపల్లి చిట్యాలలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. నల్లగొండలోని సుభాష్ విగ్రహం వద్ద సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నల్ల వస్త్రాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన నిర్వహించిన పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పాల్గొని మాట్లాడారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉండే ఓట్లను తొలగించేందుకే ప్రత్యేక ఓట్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నికల కమీషన్ ఈ దురాగతానికి పాల్పడుతుందన్నారు. స్వతంత్రంగా పనిచేయాల్సిన ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వానికి తలొగ్గడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు. దేశాన్ని మత ప్రాతిపదికన విభజించే కుట్ర మోదీ ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాషం, మహ్మద్ సలీం, గంజి మురళీధర్, పుచ్చకాయల నర్సిరెడ్డి, దండంపల్లి సత్తయ్య, మల్ల మహేష్, నల్పరాజు సైదులు, తుమ్మల పద్మ, అద్దంకి నరసింహ, కుంభం కృష్ణారెడ్డి, రవీందర్, బొల్లు రవీందర్, వెంకన్న, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కేతేపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు మా ట్లాడుతూ దళితుల ఓట్లను తొలగిస్తూ వారి రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి సీహెచ్.లూర్దు మార య్య, నాయకులు కోట లింగయ్య. అల్లి ప్రభాకర్, వి.వెంకన్న, బి.బాలరాజు, జ యప్రకాష్, లూపీస్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాలలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య మాట్లాడారు. బీహార్ రాష్ట్రంలో లక్షల ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిట్ట సరోజ, పట్టణ కార్యదర్శి బొబ్బల సుధాకర్‌రెడ్డి, ఐతరాజు నర్సింహ, మెట్టు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

నల్లగొండ రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమస్యల పై సర్వే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని శేషమ్మగూడెం మూడవ వార్డులో నిర్మించి మురుగు నీరు శుద్ధి కేంద్రాన్ని పట్టణ కమిటీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు 2008 ప్రారంభించి ఇప్పటి వరకు పూర్తి చేయలేదని ఆరోపించారు. మురుగు నీరు శుద్ధి కేంద్రాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. పానగల్, పెద్ద బండ లాంటి ముఖ్యమైన ప్రాంతాలను రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం ఇళ్లు లేని ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టారని విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, ఎగుడుదిగుడుగా పైప్ లైన్లు వేస్తూ క్యూరింగ్ లేని మ్యాన్‌హోల్‌లను నిర్మిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాషం, నాయకులు ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, రవీందర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 32.0
కనిష్ఠం 22.4
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 9 ఆగస్టు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589 (309.0570)	42,172	42,172
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.30 (4.02)	6,134.66	6,134.99
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.8982 (42.5720)	27,571	17,000

చికెన్ ధరలు: లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

Happy Raksha Bandhan

రాఖీ పౌర్ణమి సందడి

- బస్సుల్లో పెరిగిన రద్దీ
- నేడు సంతోషిమాత జయంతి

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగ సందడి జిల్లాలో నెలకొన్నది. శనివారం శుభ ఘడియల్లో రాఖీలు కట్టేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న దుకాణాల్లో నచ్చిన రాఖీలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో అంతటా రాఖీ విక్రయ దుకాణాలు వెలిశాయి. అలాగే ఒకరోజు ముందే మహిళలు పుట్టింటికి వెళ్తుండటంతో బస్సులు కిక్కిరిశాయి. బస్సుల కోసం బస్టాండుల్లో ప్రయాణికులు పడిగాపులుకాశారు. కొనుగోళ్లతో స్వీట్‌హౌస్, బేకరీలు, వస్త్ర దుకాణాలు సందడిగా మారాయి. అలాగే జిల్లాలోని సంతోషిమాత ఆలయాల్లో నేడు అమ్మవారి జయంతి వేడుకలను నిర్వహించనున్నారు.





నల్లగొండలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



నాకేంటి!

- మత్స్య సంపద సొమ్ము ఫ్రీజింగ్‌లో మతలబు ఏంటో?
- మత్స్యశాఖలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఓ సారు
- కోర్టు ఉత్తర్వులు సైతం బేఖాతరు

నల్లగొండ, నల్లగొండ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖలో మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని ఓ అధికారి శైలిపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవాల్సిన ఆ అధికారి ప్రతీ పనిలో 'నాకేంటి' అనేలా వ్యవహరిస్తుండటం వివాదాస్పదం అవుతోంది. కోర్టు తీర్పు, ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం ఉల్లంఘిస్తూ, తనను ఎవరూ ఏమి చేయలేరనే వితండవాదం చేయడం ఆయన నైజం.

మత్స్య పారిశ్రామిక సంఘం పరిధిలోని నాలుగు చెరువుల్లో కొన్నేళ్ల క్రితం చేప పిల్లలను వదిలారు. అవి పెద్దవి కావడంతో మత్స్య సంపదను సంబంధితశాఖ ఆధ్వర్యంలో విక్రయించారు. దీనికి సంబంధించి రూ.17లక్షల వరకు సమకూరాయి. ఈ డబ్బును సంఘంలో పాత సభ్యులైన 71 మందికి సమానంగా పంచాల్సి ఉంది. కాని, డబ్బును పంచకుండా బ్యాంకులో జమ చేశారు. దీంతో 71 మంది పాత సభ్యులు కోర్టును ఆశ్రయించగా, ఆ డబ్బును పంచాలని కోర్టు తీర్పునిచ్చింది. అయినా మిర్యాలగూడలోని స్థానిక అధికారి దీనికి అడ్డుపడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయనకు కోర్టు నుంచి, సంబంధితశాఖ నుంచి నోటీసులు అందాయి. కోర్టు తీర్పుతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ డబ్బును పంచడం లేదు.

పాత సభ్యులకు ప్రాధాన్యం ఏదీ?

మిర్యాలగూడ మత్స్య పారిశ్రామిక సంఘం పరిధిలో నాలుగు పెద్ద, చిన్న చెరువులు ఉన్నాయి. యాదగిరిపల్లి, మిర్యాలగూడ చిన్న చెరువు, చింతపల్లి, శ్రీనివాస్‌నగర్ చెరువు పరిధిలో 30 ఏళ్లుగా 240మంది సభ్యులు ఉన్నారు. అందులో చాలా మంది వివిధ కారణాలతో మృతిచెందారు. ప్రస్తుతం 30ఏళ్ల నాటి సభ్యులలో కేవలం 71మంది మాత్రమే మిగిలారు. ఈ 71మందికి మత్స్యశాఖలో పని చేస్తున్న అధికారి ఏ మాత్రం ప్రాధాన్యం

- మిగతా 8వ పేజీలో...



మరమ్మతుకు నోచని ఎల్-18 ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న రైతులు(ఫైల్)

ఎత్తిపోతల భారం మోయలేం

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో అంతర్భాగంగా ఎడమకాల్వపై ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాల నిర్వహణ రైతులకు భారంగా మారింది. నిర్వహణ భారాన్ని ప్రభుత్వం రైతులకే అప్పజెప్పడంతో కాలంతీరిన మోటార్లు, పైపులు, కాల్వకట్టలు, తూములు తరుచూ మరమ్మతులకు గురవుతుండటం, దానికితోడు విద్యుత్ అంతరాయంతో సరైన సమయంలో సాగునీరు అందక రైతులు నష్టపోతున్నారు. దశాబ్ద కాలంగా ఎత్తిపోతల పథకాల నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సగానికి పైగా ఎత్తిపోతలు పనిచేయడం లేదు. ఎత్తిపోతల కింద నిర్దేశించిన లక్ష ఎకరాల ఆయకట్టులో సగానికి కూడా నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు.
- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

- నిర్వహణ నుంచితప్పుకున్న ప్రభుత్వం
- తరచూ మరమ్మతులకు గురవుతున్న మోటార్లు, కాల్వలు
- విద్యుత్ కోతలతో వెతలు
- ప్రభుత్వమే నిర్వహించాలని రైతుల వేడుకోలు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగినా, ఉమ్మడి జిల్లాలో సుమారు లక్ష ఎకరాలకు ఆయకట్టుకు సాగు నీరు అందకపోవడంతో ఎడమకాల్వపై ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. వీటి ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరందించే విధంగా గత ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. రైతుల భూములను తనఖా పెట్టి 1970-72లో 18 కోఆపరేటివ్ ఎత్తిపోతల పథకాలను, ఐడీసీ కింద మరో 24, మొత్తం 42 ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేశారు. అనంతర కాలంలో మరో 26వరకు నూతన ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేశారు. ఈ పథకాల పంప్ హౌస్‌ల నిర్వహణకు సిబ్బందిని సైతం ఎన్నెస్పీ అధికారులు నియమించి, వేతనాలు సైతం చెల్లిస్తూ వచ్చారు. కాగా, తరచూ విద్యుత్ కోతలతో మోటార్లు కాలిపోవడం, నీరు అందక పంటలు ఎండిపోతుండటంతో ఎన్నెస్పీ అధికారులు సబ్‌స్టేషన్ల నుంచి ఎత్తిపోతల పథకాలకు ప్రత్యేక విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. రోజుకు 18 గంటల చొప్పున విద్యుత్ సరఫరా అయ్యేది.


వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రూ.4,444కోట్ల ప్రపంచబ్యాంకు నిధులతో సాగర్ కాల్వల ఆధునికీకరణ చేపట్ట గా, ఆ నిధుల నుంచి ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు రూ.200కోట్లు కేటాయించారు. ఆ తరువాత దీన్ని రూ.100 కోట్లకు కుదించినట్లు చెబుతున్నారు. వీటి ద్వారా పంపులు, మోటార్లు, కాల్వ కట్టలపై రహదారులు, తూములు మరమ్మతులు నిర్వహించారు.

ఎన్నెస్పీ నుంచి ఐబీకి

కొంతకాలం తరువాత ఎత్తిపోతల నిర్వహణ ను ఎన్నెస్పీ నుంచి ఐడీసీకి (ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) బదిలీచేసి తిరిగి నిర్వహణ చేపట్టిన ఎన్నెస్పీ ప్రస్తుతం ఐబీకి (ఇరిగేషన్‌బ్రాంచ్) అప్పగించిందని రైతులు చెబుతున్నా రు. చెరువులపై అవగాహన కలిగిన ఐబీ శాఖకు విద్యుత్ మోటార్లతో నడిచే ఎత్తిపోతల పథకాలపై

- మిగతా 8వ పేజీలో...

స్థానిక అధికారులకు అత్యవసర అధికారాలు ఇవ్వాలి



అత్యవసర సమయాల్లో మోటార్ల మరమ్మతులకు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పునకు రూ.5లక్షల వరకు నిధులు మంజూరు చేసే అధికారం ఎస్‌ఈకి లేదా ఈఈ స్థాయి అధికారికి ఇవ్వాలి. పంటలు పొట్ట, ఈత సమయంలో మరమ్మతులకు గురైతే నిధుల కోసం కమిటీకి పంపి అనుమతులు వచ్చే వరకు తీవ్ర ఆలస్యం అవుతోంది. ఎత్తిపోతల పథకాలకు వ్యవసాయ విద్యుత్ లైన్ కాకుండా ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయాలి. పథకాలకు తక్షణ మరమ్మతులు చేపట్టి నిర్వహణకు అవుట్‌సోర్సింగ్ పద్ధతిన తాత్కాలిక సిబ్బందిని నియమించి పర్యవేక్షణ చేయాలి.
- పాదూరి శశిధర్‌రెడ్డి, ఎత్తిపోతల రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఇందిరమ్మ ఇళ్లను వేగవంతంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- దేవరకొండలో సమీక్ష

దేవరకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి తెచ్చి వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. ఎల్-3 నుంచి ఎల్-1కు వచ్చే ఇళ్ల లబ్ధిదారుల జాబితా పారదర్శకంగా ఉండాలన్నారు. ఇళ్లు మంజూరై నిర్మించుకునేందుకు ఆర్థిక స్తోమతలేని వారిని గుర్తించి స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా రుణం ఇప్పించేందుకు ఏపీఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణ పురోగతిని తెలుసుకొని లబ్ధిదారులకు ప్రోత్సాహం అందించాలన్నారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ, లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా బిల్లులు చెల్లించాలన్నారు. ఎల్-3 నుంచి ఎల్-1కు పంపించే జాబితాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్హులైన వారిని చేర్చాలన్నారు. సమస్యలుంటే అధికారులు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. నియోజకవర్గంలో మొదటి విడతగా 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డివిజన్‌లోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో ఎమ్మెల్యే బాలునాయక్

అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి

(ఆంధ్రజ్యోతి, హాలియా): ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా అత్యవసర సమయంలో అప్రమత్తంగా ఉండాలని, సాగునీటిని నియంత్రించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హాలియా 17వ మైలు, 42వ మైలు రాయి దేవులపల్లి వద్ద సాగర్ ఎడమ కాల్వ ఎస్కేప్ ఛానళ్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందగానే తక్షణమే నీటిని ఎస్కేప్ ఛానెల్ ద్వారా స్ట్రీమ్‌కు పంపించాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపీనాథ్, ఆర్‌ఐ నవీన్, తదితరులు ఉన్నారు.

వాగులకు జలకళ



వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో పొంగిపొర్లుతున్న చిత్రపరక వాగు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లావ్యాప్తంగా సగటున 3.19సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా శాలిగౌరారంలో 13.99 సెంటీమీటర్లు, నకిరేకల్‌లో 4.25 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. 7

ఓట్ల తొలగింపు

ప్రజాస్వామానికి గొడ్డలిపెట్టు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనలో పాల్గొన్న జూలకంటి రంగారెడ్డి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి

మిర్యాలగూడ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వ్యవస్థను పరిహసిస్తూ బీహార్‌లో ఓట్ల తొలగింపునకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటివని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయం నుంచి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వరకు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అనుకూలంగా మార్చుకుని అడ్డదారిన ఓట్ల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఆరోపించారు. ఎన్డీఏ కూటమికి ఓట్లు వేయని వర్గాలుగా భావిస్తున్న ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ వర్గాలకు చెందిన ఓట్లను జాబితా నుంచి తొలగిస్తూ బీజేపీ అవకతవకలకు, అక్రమాలకు పాల్పడుతోందని అన్నారు. బీహార్ రాష్ట్రంలో 65 లక్షల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. ప్రజల, ప్రతిపక్ష పార్టీల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా ఏకపక్షంగా ఓట్ల తొలగింపునకు పూనుకోవడం రాజ్యాంగ ద్రోహం అన్నారు. అధికారం కోసం ఎన్నికల్లో కేంద్రం అడ్డదారులు తొక్కుతోందని విమర్శించారు. ప్రజాస్వామికవాదులంతా కేంద్ర నిరంకుశ విధానాలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డబ్బికార్ మల్లేష్, నూకల జగదీశ్‌చంద్ర, సత్యనారాయణ, గాదె పద్మ, భావండ్ల పాండు, మూడావత్ రవినాయక్, రెమిడాల పరుశరాములు, తిరుపతి రాంమూర్తి, అరుణ, ఊర్మిళ, గోవర్ధన్, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాలతో ఆలయాలు కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగాయి. రుద్రహోమం, లలితహోమం నిర్వహించారు. మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. దీంతో జిల్లా అంతటా అధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది.

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి

డీఈవో భిక్షపతి

హాలియా, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. శుక్రవారం హాలియా మున్సిపాలిటీలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన తనిఖీచేశారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార పదార్థాలను వడ్డించాలని స్పెషల్ ఆఫీసర్ హైమావతికి సూచించారు. అదే విధంగా స్టోర్‌రూం, కిచెన్‌రూం, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమై విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు. విద్యార్థినులకు గుణాత్మక విద్యను బోధించి వారి ఉన్నతికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



చిట్యాల పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీచేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చిట్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డెంగీపై వైద్యులు, సిబ్బందితోపాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాఖాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం గ్రామంలో డెంగీ బారిన పడిన వ్యక్తి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేసి ల్యాబ్, ఫార్మసీ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దోమలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. జ్వరం అధిక రోజులు బాధపెడుతుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని, అంకితభావంతో పేదలకు సేవలు అందించాలని కోరారు. ఆయన వెంట క్షయ నియంత్రణ జిల్లా అధికారి కళ్యాణ్ చక్రవర్తి, డీఎంవో ప్రదీప్, వైద్యాధికారి ఈసం వెంకటేశం, సీహెచ్‌వో నర్సింగ్‌రావు, అనిల్ ఉన్నారు.

వీ.టీనగర్ జడ్పీహెచ్ఎస్‌లో తాగు నీటి సమస్య

చింతపల్లి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంకటేశ్వరనగర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మిషన్‌భగీరథ జలాలు నిత్యం సరఫరా కాకపోవడంతో తాగునీటిసమస్య జఠిలమవుతుంది. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి తాగునీటి సీసాలు తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి నీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

అనుముల తహసీల్దార్‌గా శాంతిలాల్ బాధ్యతల స్వీకరణ

హాలియా, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): అనుములతహసీల్దార్‌గా శాంతిలాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు రఘు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించారు. ఈసందర్భంగా తహసీల్దార్ శాంతిలాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు అసౌకర్యం కలగకుండా రెవిన్యూ అందించనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

● ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు ● పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు

మిర్యాలగూడ టౌన్, వేములపల్లి, హాలియా, చింతపల్లి, గుర్రంపోడు, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): వరలక్ష్మీవ్రత పూజలను శుక్రవారం అంతటా భక్తి శ్రద్ధలతో ఆచారించారు. పలు ఆలయాల్లో మహిళలు లక్ష్మీదేవి విగ్రహాలకు పసుపు, కుంకుమ, పూలతో అలంకరణ చేసి వ్రతాలు చేశారు. అనంతరం వాయినా లిచ్చిపుచ్చుకున్నారు. మహిళలు ఆలయాలకు చేరుకుని వరలక్ష్మీ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబ సభ్యులను ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో చల్లగా చూడాలంటూ వరలక్ష్మీ అమ్మవారిని వే డుకున్నారు.: అనుముల మండలం హాలియా మునిసిపాలిటీలోని సాయిమందిరం, రామాలయం, స్వయం భూవేంకటేశ్వర ఆలయాల్లో శుక్రవారం సామూహిత వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. కొందరు మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మి వ్రతాలను నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. చింతప ల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్), వింజమూర్, కుర్మపల్లి గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలో పూజలు చేశారు. సౌభాగ్యంగా ఉండాలని వరలక్ష్మి మాతాను కోరుకున్నట్లు మహిళలు తెలిపారు. గుర్రంపోడు మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపి సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. కొప్పోలు సీతారామచంద్రస్వామి, బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు పాల్గొని స్వామివారికి, అమ్మవార్లకు విశేషాభిషేకాలు చేశారు. చామలేడులోని పురాతన ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారి ఉత్సవ మూర్తులకు అభిషేకాలు జరిపి కుంకుమార్చనలు చేశారు.



వేములపల్లి: శెట్టిపాలెం ఉమామహేశ్వర ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



గుర్రంపోడులోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ..

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తాం

● రాజు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, నాంపల్లి



ఇంటర్వ్యూ Interview

(ఆంధ్రజ్యోతి- చింతపల్లి)

ప్రజలు సైబర్‌నేరాల బారిన పడకుండా ఉండడానికి అవగాహన కలిస్తున్నామని నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.రాజు తెలిపారు. చింతపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా వారి చైతన్యం కల్పిస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి: చింతపల్లితో పాటు వేంకటేశ్వరనగర్‌లో దొంగతనాలతో పాటు సైబర్ నేరాలు పెరిగాయి. వీటిని నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు. ?

సీఐ: సైబర్ నేరాల నియంత్రణకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దొంగతనాల నియంత్రణకు కోసం వ్యాపారస్థులతో కలిసి త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. పోలీసుపెట్రోలింగ్ పెంచి దొంగతనాలు ఆరికడతాం.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో ఆకతాయిలతో పాటు గ్యాంగ్‌లు పెచ్చుమీరి పోతున్నాయి. వీటిపై ఎలా దృష్టి సారిస్తారు ?

సీఐ: ప్రధానంగా గ్యాంగ్‌లు, వారిని ప్రోత్సహించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం సరికాదు, మైనర్లు వాహనాలు నడపకూడదు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలతో పాటు కళాశాలల వద్ద ఈవ్‌టీజింగ్ చేపట్టి వారిపై ప్రత్యేక నిఘా పెంచుతాం. ఇప్పటికే కొన్ని కాలనీలను గుర్తించాం. అక్కడ సమస్యాత్మక ప్రాంతంగా పరిగణంలోకితీసు కొని నిఘా పెంచుతాం.

ఆంధ్రజ్యోతి: యువత వ్యసనాలకు గురికాకుండా ఉండేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు. ?

సీఐ : యువత వ్యసనాలకు గురికాకుండా కళాశాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గంజాయి, మత్తు పదార్థాలు , మాదకద్రవ్యాలు మద్యం వాటి వల్ల ఆరోగ్య సమస్యలు ఇబ్బందులు గురించి యువతకు వివరిస్తున్నాం. సమాజంలోని యువత సన్మార్గంలో పయనించాలని సూచిస్తున్నాం.

జూడో విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం క్రీడాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటోందని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులు క్రీడా సక్తిని పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. కోచ్ శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో పట్టణ క్రీడాకారులు మణిసాత్విక్, కౌశల్, కౌశిక్ పతకాలు సాధించడం ఆదర్శనీయమన్నారు. విద్యార్థులనుక్రీడాభివృద్ధి శాఖ జిల్లా అధికారి అక్బర్‌అలీ అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సాయి ప్రశాంత్

హాలియా,ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హాలియా ఎస్ఐ సాయిప్రశాంత్ అన్నారు. మిషన్ ఆర్‌ఆర్‌ఆర్ రోడ్‌సేఫ్టీ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం కొత్తపల్లి గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ హెచ్‌పీ కుమారి మంజుల సీపీఆర్(కార్డియోపల్మానరీ రీజసిటేషన్) ప్రదర్శించి అవగాహన కల్పించారు. అలాగే గ్రామ రహదారి భద్రతా కమిటీని ఏర్పాటు చేసి ట్రాఫిక్ క్రమశిక్షణ, ప్రమాద నివారణపై పలు సూచనలు చేశారు. అనంతరం పోలీస్ జాగృతి కళా జాతర బృందం సాంస్కృతి కార్యక్రమాల ద్వారా ప్రజలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నల్లగొండ డీటీఆర్‌బీ హెడ్ కానిస్టేబుల్ రాజు, హాలియా పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ అబ్బగోని యాదయ్య పాల్గొన్నారు.

దేవరకొండ డివిజన్‌లో వర్షం

దేవరకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో శుక్రవారం సాయంత్రం వర్షం కురుస్తుంది. ఈ వర్షంతో పత్తి రైతులు కొంత ఊరట చెందుతున్నారు. డివిజన్‌లో 1.40 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలను వేశారు. పత్తి విత్తనాలు మొలకెత్తుతున్నప్పటికి వర్షాలు కురవకపోవడంతో రైతులు కొన్ని రోజులుగా వర్షం కోసం ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. గురు, శుక్రవారాల్లో వర్షాలు కురుస్తుండడంతో రైతులు, ప్రజలు కొంత ఊరట చెందుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

వేములపల్లి : మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటపొలాలు నీట మునిగాయి. మండలంలో సుమారు 35.4మి.మీ వర్షపాతం నమోదైంది. శెట్టిపాలెం గ్రామ శివారులోని చిత్రపరక వాగు జలకళను సంతరించుకున్నాయి. అలాగే మండలం మధ్యగుండా వెళ్లే పాలేరు వాగు సైతం నీటి ప్రవాహం కొనసాగగా వాగుపై గల చెక్‌డ్యామ్ జలకళతో నిండుకుండలా మారాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మిర్యాలగూడ, దేవరకొండ : భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ , దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి సూచించారు. మిర్యాలగూడ, దేవరకొండలలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను శుక్రవారం ప్రా రంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసులు, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక సహా అన్ని సంబంధితశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వర్షం వల్ల ప్రజలకు ఇబ్బంది ఏర్పడితే 24 గంటలు పనిచేసేలా కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు, బాధితులు సమాచారం, దేవరకొండలో సాయం కోసం సెల్. 8179199255 కంట్రోల్ రూం ఫోన్ ంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ

చింతపల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరనగర్ శాంతినికేతన్ హైస్కూల్‌లో శుక్రవారం పాదపూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులతో తల్లిదండ్రుల పాదాలకు అభిషేకం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బోదాసు శ్రీనివాస్, అంగిరేకుల గోపాల్ లక్ష్మమ్మ పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు పాద పూజ చేస్తున్న విద్యార్థులు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, సీనియర్ నేత జానారెడ్డి

నాగార్జునసాగర్, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో చేప ట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు.సాగర్ హిల్‌కాలనీలో తన నివాసంలో శుక్రవారం తన తండ్రిమాజీ మంత్రి జానారెడ్డితో కలిసి పబ్లిక్‌హెల్త్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్‌శాఖ, మిషన్ భగీరథ అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. వర్షకాలం నేపథ్యంలో గ్రా మాల్లో ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అంతే కాకుండా గ్రామాల్లో, కృష్ణ పట్టె తండాల్లో లోవోల్టేజీ సమస్యలు రాకుండా అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మార్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఎక్కడైన ఇంటింటికి నల్లాలు ఏర్పాటు చేయకపోతే వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. హాలియా, నందికొండ మునిసిపాలిటీల్లో కొనసాగుతున్న అమృత్ 2.0 పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. .వానాకాలం కావడంతో వీధుల్లో నీటి నిల్వలు ఉన్న చోట దోమలు ప్రబలకుండా ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లడం, ఆయిల్ బాల్స్ వేయడం వంటి పనులను చేపట్టాల్సిన పబ్లిక్ హెల్త్ అధికారులకు తెలిపారు. విష జ్వరాలు ప్రబల కుండా గ్రామాల్లో, తండాల్లో వీధులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

● **నందికొండలో రూ. 9 కోట్లతో అభివృద్ధి పనులు**

నందికొండ మునిసిపాలిటీలో రూ. 9 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను కూడా త్వరలో ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ పనుల్లో ఫైలాన్ కాలనీలో పిల్లర్ వద్ద నుంచి జెన్‌కో కార్యాలయం వరకు డబుల్ రోడ్డు వేయడంతో పాటు డివైడర్ ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ కో సం రూ. 8 కోట్లు అలాగే హిల్‌కాలనీ, ఫైలాన్ కాలనీల్లో అవసరమైన చోట సీసీ రోడ్ల నిర్మాణానికి మరో కోటి రూపాయాలు వాడుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మాజీ జడ్పీటీసీ కర్నాటి లింగారెడ్డి, ప్రాజెక్టు ఎస్ఈ మల్లికార్జున్‌రావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ మనోహర్, ఏఈ సురేష్, నందికొండ, హాలియామునిసిపల్ కమిషనర్లు గురులింగం, రామదుర్గ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



కార్మికులకు మందులు పంపిణీ చేస్తున్న కమిషనర్ సుదర్శన్, డాక్టర్ విజయ

దేవరకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, వైద్యుల సూచనలు పాటించాలని దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ సూచించారు వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం దేవరకొండ మునిసిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు వివిధ విభాగాల సిబ్బందికి నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బొడ్డుపల్లి పీహెచ్‌సీ బృందం పారిశుధ్య సిబ్బందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ విజయ పారిశుధ్య కార్మికులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్, మేనేజర్ రాకేష్, శత్రునాయక్, జగమంతు, హెల్త్‌అసిస్టెంట్లు లింగమయ్య, భవాని, కవిత, సిబ్బంది రవికుమార్, రమాకాంత్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

నాగార్జునసాగర్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం సాగర్ హిల్ కాలనీలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి ఉద్యమ కారులు వినతి పత్రం అందజేశారు. ఉద్యమ కారులకు ఇళ్ల స్థలాలు, పింఛన్లు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇందుకు జానారెడ్డి స్పందిస్తూ సాగర్‌లో ఎక్కడైన ప్రభుత్వ స్థలం ఉంటే ఉద్యమకారులకు ఇవ్వడానికి అభ్యతరం లేదని తెలిపారు. నియోజక వర్గంలో ఎక్కడైన ప్రభుత్వ స్థలం ఉంటే 250 గజాల స్థలాన్ని ఇవ్వడానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఉద్యమకారుల ఫోరంరాష్ట్ర ఉపా .ధ్యక్షురాలు జానకీరెడ్డి, మాజీ కౌన్సిలర్ రమేష్‌జీ, చంద్రమౌళీ, మధు, యాదగిరి, వెంకోజీ ఉన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

దామరచర్ల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కేంద్రం రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను వెంటనే రద్దు చేసి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య అన్నారు. మండలంలోని బొత్తలపాలెం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం మూడు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి వాటిని పూర్తి స్థాయిలో రద్దు చేయకుండా తాత్కాలికంగా ఉపసంహరించకోవడంతో భవిష్యత్తులో రైతులు తీవ్ర నష్టపోతారని అన్నారు. రైతులకు సరిపడా ఎరువులను, విత్తనాలను సబ్సిడీపై అందించాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పంటలను నిల్వ చేసేందుకు రైతులకు గోదామ్‌లను నిర్మించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్, ధనావత్ శాంతా, ధీరావత్ లింగానాయక్, జమ్ముల కోటయ్య, పేరుపొంగు లక్ష్మయ్య, సైదులు, లక్ష్మయ్య, పున్నయ్యపాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం

దేవరకొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీపీఎం దేవరకొండ మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య విమర్శించారు. శుక్రవారం దేవరకొండలో సీపీఎం ఆధ్వర్యంలో బిహర్ రాష్ట్రంలో ఓట్ల తొలగింపనకు నిరసన వ్యక్తం చేస్తు అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతుందన్నారు. కార్యక్రమంలో యాదగిరి, లింగయ్య, రామస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.

పండుగ సాయన్నను ఆదర్శంగా తీసుకోవాలి

మిర్యాలగూడ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పేదల దేవుడు పండుగ సాయన్నను యువత ఆదర్శంగా తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పండుగ సాయన్న జయంతిని స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో నిర్వహించారు. సాయన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి బహుజన రాజ్య స్థాపనకు కృషి చేశారని అన్నారు. ధనవంతుల గిడ్డంగులపై దాడి, ఖజానాను కొల్లగొట్టి పేదలకు ధాన్యం, సొమ్మును పంచిన పేదల దేవుడని కొనియాడారు.

యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని పేదలకు సహాయపడే కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రబెల్లి దుర్గయ్య, దోనేటి శేఖర్, తరుణ్‌కుమార్, చంటి, గోపీచంద్, సాయి కిరణ్, జానకిరాముడు, జీవన్, వాసు, సాయి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల భారం మోయలేం

(5వ పేజీ తరువాయి)


అవగాహన లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయని రైతులు వాపోతున్నారు. ఐడీసీ కింద సాగర్ నియోజకవర్గంలో 19, మిర్యాలగూడ పరిధిలో 18, ఎన్నెస్పీ కింద మిర్యాలగూడలో 15, సాగర్ నియోజకవర్గంలో 16, మొత్తం 68 ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. ఐడీసీ ఎత్తిపోతల పథకాల ద్వారా 24, 150 ఎకరాలు, ఎన్నె స్పీ ఎత్తిపోతల పథకాల ద్వారా 47,000 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. ఇప్పటికే ఐడీసీ పరిధిలో 15 వేల ఎకరాలకు సాగునీరందించే 18ఎత్తిపోతల ప్రాజెక్టులను ఎత్తివేశారు. ఎత్తిపోతల పథకాలను రైతులే నిర్వహించుకోవాల్సి రావడంతో నిర్వహణ భారం మోయలేని పరిస్థితి ఏర్పడింది. రైతులు బోరు, బావుల లాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడంతో 18 ఎత్తిపోతల పథకాలను ఎత్తివేశారు.

కొత్త ఎత్తిపోతల పథకాలకు చర్యలు

మిర్యాలగూడ డివిజన్‌లో కొత్తగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో నెల్లికల్, దున్నపోతుల గండి, కేశవపురం, బొత్తలపాలెం, వజీరాబాద్, వీర్లపాలెం ఎత్తిపోతలను నిర్మించనుంది. నెల్లికల్ ఎత్తిపోతల ద్వారా రాజవరం మేజర్ కింది చివరి భూములకు 8,500 ఎకరాలకు, నూతనంగా 16,100 ఎకరాలకు మొత్తంగా 24,600 ఎకరాలకు సాగునీరు అందుతుంది. మిర్యాలగూడ నియోజకవర్గంలో ఐదు ఎత్తిపోతల పథకాల ద్వారా 12,500 ఎకరాల చివరి భూములకు, 19వేల నూతన ఆయకట్టుకు నీరు అందించేలా నిర్మాణం చేపట్టారు. రూ. 24కోట్ల వ్యయంతో పొగిళ్ల, రూ.202కోటతో కంబాలపల్లి, రూ.184 కోట్లతో వైజాగ్‌కాలనీ సమీపంలో అంబాభవాని, రూ.82కోట్లతో పెద్దగట్టు, రూ.90కోట్లతో అంగడిపేట సమీపంలో ఏకేబీఆర్ ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వం నిర్మిస్తోంది. వీటిద్వారా ఆయకట్టు చివరి భూములకు నీరందించడమేగాక నూతనంగా వేలాది ఎకరాల భూములు సాగులోకి రానున్నాయి.

అయితే కొత్త ఎత్తిపోతలను ఏర్పాటుచేస్తున్నా, వీటి నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే ఉన్న ఎత్తిపోతల పథకాల నిర్వహణ భారం తమపై వేయడంతో అవి అస్తవ్యస్తంగా మారి నిరుపయోగమవుతున్నాయని, ప్రస్తుతం కొత్తగా ఆయకట్టును స్థిరీకరించిన నేపథ్యంలో అన్ని ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


మరమ్మతులను పూర్తిస్థాయిలో చేపట్టాలి



రైతులకు ఎత్తిపోతల పథకాల నిర్వహణ భారంగా ఉంది. చాలాకాలం నుంచి మోటార్లు, కాల్వకట్టలు, తూములకు మరమ్మతు చేయనందున పంటలకు సాగు నీరు సక్రమంగా అందడం లేదు. విద్యుత్ లైన్‌ను మార్చి రోజు రాత్రి వేళల్లో సుమారు 6గంటలు విద్యుత్‌లో కోత విధిస్తున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ చూపి మరమ్మతులు చేపట్టి నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించాలి.

-కొప్పు వెంకన్న లిఫ్ట్ రైతు

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం



ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఆర్-6కు రూ.3.70లక్షలు, ఎల్-16కు రూ.12లక్షలు, ఎల్-17కు రూ.4.5లక్షలు, ఎల్-18కు రూ.13లక్షలు, ఎల్-20కి రూ.10లక్షలు, ఎల్-21కి రూ.12లక్షలతో మోటార్లు, వైర్లు, స్టార్టర్లు, బేరింగ్‌లు తదితర మరమ్మతు పనులకు ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు నివేదించాం.

-జనార్దన్, ఐబీ డీఈ

నాకేంటి!

(5వ పేజీ తరువాయి)

ఇవ్వడం లేదు. చనిపోయిన వారి స్థానంలో వారి వారసులకు సభ్యత్వాలు ఇవ్వాలి. కాగా, అందుకు విరుద్ధంగా కొత్తగా అడహక్ కమిటీని నియమించి వారసులకు సభ్యత్వాలు ఇవ్వకపోగా, కొత్తగా మరో 100మందిని సభ్యులుగా సృష్టించారు. ఒక్కో సభ్యత్వానికి వారి నుంచి రూ.10వేలకు పైగా వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడహక్ కమిటీని ఎన్నికల వరకు కొనసాగించే వీలుంటుంది. అయితే ఈ కమిటీలో అర్హులైన వారికి సభ్యత్వాలు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాల్సి ఉండగా, అనర్హులకు, అనుకూలమైన వారికి సభ్యత్వాలు ఇచ్చి ఎన్నికల్లో మోసాలకు పాల్పడేందుకు యత్నిస్తున్నారని చర్చ సాగుతోంది. మత్స్యశాఖలో సభ్యత్వాలు ఇచ్చే ముందు స్కిల్ టెస్ట్ నిర్వహించాలి. చెరువులో వలలు విసరడంతో పాటు వివిధ అంశాల్లో అధికారులు పరీక్ష నిర్వహించి సభ్యత్వాలు ఇవ్వాలి. అలాంటివి ఏమీ లేకుండానే 100మంది వరకు సభ్యత్వాలు ఇచ్చారు. వారసులను పూర్తిగా పక్కన పెట్టడంతో పాటు జనరల్ బాడీ సమావేశాలు ఏర్పాటు చేయలేదు. మూడేళ్లుగా జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించకుండా అడహక్ కమిటీ పెత్తనం చేస్తోంది. మొత్తం ముగ్గురు అధికారుల కన్నుసన్నల్లోనే ఈ కమిటీ పనిచేస్తూ తోచిన విధంగా వ్యవహరిస్తోందని, బెస్తలకు, ముదిరాజ్‌లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను దూరం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందని మత్స్యకార్మికులు పలువురు ఆరోపిస్తున్నారు. అడహక్ కమిటీ నిబంధనల మేరకు పనిచేయకుండా పూర్తిస్థాయి ఎన్నికైనా కమిటీలా వ్యవహరిస్తూ మిర్యాలగూడ మత్స్యపారిశ్రామిక సంఘాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డబ్బు పంపిణీ ఎఫ్‌డీఏ పరిధిలో ఉంటుంది

మిర్యాలగూడ మత్స్య పారిశ్రామిక సంఘం సంబంధించి గతంలో కార్మికులకు చెల్లించాల్సిన డబ్బును బ్యాంకులో జమ చేశారు. అది మా పరిధిలో లేదు. డబ్బు పంపకాల వ్యవహారం పూర్తిగా ఎఫ్‌డీఏ పరిధిలోనే ఉంటుంది. ఉన్నతాధికారుల సూచన మేరకే డబ్బును పంచాలని ఆదేశాలు జారీ చేశాం.

-చరిత, జిల్లా మత్స్యశాఖ అధికారి

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : అతడు (మార్నింగ్, మ్యాట్నీ) జూనియర్ (ఫస్ట్, సెకండ్ షో) వెంకటేశ్వర: హరిహర వీరమల్లు / రాఘవ: కింగ్‌డమ్ / విగ్రోస్: బకాసుర, రెస్టారెంట్, కింగ్‌డమ్, మహావతార్, నరసింహ దేవరకొండ : మనోజ్ : మైబేబీ క్షేత్రి వెంకటేశ్వర : హరిహర వీరమల్లు